# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి: 12 | సంచిక: 50 | మంగళవారం | 16-09-2025 | పేజీలు: 08 | వెల రూ. 3 | www.epaperjournalistdiary.com


ఎవరు విడాకులు తీసుకున్నా..



8లో..

## జూబ్లీహిల్స్ బై పోల్ లో ట్విస్ట్..

- కవితతో మాజీ ఎమ్మెల్యే విష్ణు భేటీ.. కవిత తరపున పోటీ?

**జర్నలిస్ట్ డైరీ, తెలంగాణ బ్యూరో:**

రాష్ట్ర రాజకీయం అంతా జూబ్లీహిల్స్ బై పోల్ కేంద్రంగా సాగుతోంది. ప్రధాన పార్టీలు అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్న నేపథ్యంలో ఆసక్తికర మలుపు తిరిగింది. ఎమ్మెల్సీ కవితతో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి భేటీ కావడం హాట్ టాపిక్ అయింది. ఇవాళ ఉదయం కవిత నివాసానికి వెళ్లిన విష్ణువర్ధన్ అరగంటకుపైగా ఆమెతో చర్చించారు. ఇటీవల బీఆర్‌ఎస్‌లో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో రాబోయే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కవిత తరపున అభ్యర్థి బరిలో ఉంటారనే ప్రచారం జరుగుతున్న వేళ ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకున్నది.

**దాల్ మే కుచ్ కాలా హై!...**

ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన విష్ణువర్ధన్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో..



# ఈసీ తప్పు చేస్తే మొత్తం ప్రక్రియను రద్దు చేస్తాం..

- బీహార్ ఎస్ఐఆర్‌పై సుప్రీం కోర్టు విచారణ
- ఎస్ఐఆర్ దేశం అంతటా వర్తిస్తుంది

**జర్నలిస్ట్ డైరీ, తెలంగాణ బ్యూరో:**

సుప్రీంకోర్టులో సోమవారం బీహార్‌లో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)పై విచారణ జరిగింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మ్లయ బాగ్చిలతో కూడిన ధర్మాసనం మాట్లాడుతూ.. ఏ దశలోనైనా కేంద్ర ఎన్నికల సంఘం తప్పుడు పద్ధతిని అవలంబించిందని తేలితే, ఆ పరిస్థితిలో మొత్తం SIR ప్రక్రియను రద్దు చేస్తామని పేర్కొంది. బీహార్ SIRపై తాము ముక్కలుముక్కలుగా అభిప్రాయాన్ని ఇవ్వలేమని స్పష్టం చేసింది. బీహార్‌లోనే కాకుండా భారతదేశం అంతటా SIR ప్రక్రియకు వర్తిస్తుందని ధర్మాసనం తేల్చి చెప్పింది.

మిగతా 2వ పేజీలో..



రూ. 10 కోట్లకు బండి సంజయ్‌పై

# కేటీఆర్ పరువు నష్టం దావా



- హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించిన కేటీఆర్
- ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఆధారాలు లేకుండా ఆరోపణలు చేశారన్న కేటీఆర్
- లీగల్ నోటీసుకు స్పందించకపోవడంతో కోర్టులో పిటిషన్

2

## తెరపైకి కేసీఆర్ విజిలెన్స్ రిపోర్టు?

- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సీఎం రేవంత్ కీలక చర్చలు
- బీఆర్ఎస్ కాలంలో సిద్ధమైన విజిలెన్స్ రిపోర్ట్ వెలికితీత
- ప్రైవేట్ కాలేజీల అవకతవకలపై విద్యార్థి సంఘాల ఆందోళన
- నకిలీ సిబ్బంది, సౌకర్యాల లోపంపై ప్రభుత్వ ఆరా



2

## కేసీఆర్‌కు, మీకు తేడా ఏముంది?..

- ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లని చంకలు గుద్దుకున్నారు కదా?
- మీ నిర్వాకంవల్లే 15 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమైన కన్పిస్తలేదా?
- కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది?
- రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

ఫీజు రీయంబర్స్ మెంట్ బ్రాండ్ అంబాసిడర్లం తామేనని సంకలు గుద్దుకున్న కాంగ్రెస్ నేతల నిర్వాకంవల్లే కాలేజీలు మూతపడి లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. మూసీ సుందరీకరణ, ఫోర్త్ సిటీ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం 15 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తు కనబడటం లేదా? రాష్ట్ర బడ్జెట్ లో నుండి రూ.8 వేల కోట్ల రూపాయలు చెల్లించలేరా? అంటూ ప్రశ్నించారు. నక్సలైట్లను ఎన్ కౌంటర్ చేయడంపైనా కేంద్ర మంత్రి తీవ్ర స్థాయిలో స్పందించారు. "దేశాన్ని రక్షించే



మిగతా 2వ పేజీలో..

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి



2

- శాసనసభ అదనపు కార్యదర్శిని కలిసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- 10 మంది కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లిన బీఆర్ఎస్
- మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు చెప్పిందన్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

## ఒక ఇంట్లో ఉన్నప్పుడు చిన్నచిన్న గొడవలు సహజం.. బజారున పడొద్దు

- విభేదాలను సామరస్యంగా పరిష్కరించుకోవాలన్న కేటీఆర్
- జూబ్లీహిల్‌స్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ వ్యాఖ్యలు... కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం
- హైదరాబాద్ అనాథ అయిపోయిందంటూ ఆవేదన
- వర్షాలకు ముగ్గురు చనిపోయినా మంత్రులు పట్టించుకోలేదని విమర్శ

2





## ప్రైవేట్ కాలేజీలు మూతపడే పరిస్థితి

- యాజమాన్యాలు రోడ్డున పడేలా ఉన్నాయి
- జీతాలు ఇవ్వలేక సిబ్బందికి ఇబ్బందులు
- ఫీజ్ రీయింబర్స్ మెంట్ పై సర్కార్ కు స్పష్టత కొరవడింది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు

2



## ఈసీ తప్పు చేస్తే మొత్తం ప్రక్రియను రద్దు చేస్తాం..

**మొదటిపేజీ తరువాయి**

బీహార్ ఓటర్ల జాబితాల SIR ప్రక్రియలో ఓటర్ల గుర్తింపు రుజువుగా ఆధార్ కార్డును 'తప్పనిసరి'గా చేర్చాలని సెప్టెంబర్ 8న జరిగిన విచారణలో సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ ఉత్తర్వును సెప్టెంబర్ 9 నాటికి అమలు చేయాలని కోర్టు ఎన్నికల కమిషన్‌ను ఆదేశించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఓటర్ల జాబితాల తయారీ, ప్రతి రాష్ట్ర పార్లమెంటు, శాసనసభ ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించడం, అక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా నియంత్రించడం ఈసీ బాధ్యత అని ఎన్నికల కమిషన్ తన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొంది. "ఈ రాజ్యాంగ నిబంధన ఓటర్ల జాబితాల తయారీ, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని విషయాలలో కమిషన్ పూర్తి అధికారానికి ఆధారం" అని అఫిడవిట్‌లో పేర్కొంది. బీహార్‌లో SIR చెల్లుబాటుపై తుది వాదనలను వినిపించడానికి అక్టోబర్ 7కు సుప్రీంకోర్టు విచారణను వాయిదా వేసింది.



## జూబ్లీహిల్స్ బై పోల్ లో ట్విస్ట్..

**మొదటిపేజీ తరువాయి**

పెద్దమ్మతల్లి దసరా నవరాత్రి వేడుకలకు కవితను ఆహ్వాన పత్రిక అందించేందుకు వచ్చినట్లు చెప్పారు. తెలంగాణ భవన్, కేసీఆర్‌తోనే తన ప్రయాణం అని స్పష్టం చేశారు. అయితే విష్ణువర్ధన్ పైకి అలా చెప్పినా సమావేశంలో జూబ్లీహిల్స్ బై పోల్ అంశం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం కవితతో బీఆర్ఎస్ శ్రేణులు దూరంగా ఉంటున్నాయి. ఆమె పేరు ప్రస్తావించడానికి అగ్రనేతలు ఎవరూ సాహసించడం లేదు. అలాంటిది జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కీలక నేతగా ఉన్న విష్ణు కవితను కలవడం వెనుక ఏదో మతలబు ఉండే ఉంటుందనే టాక్ పొలిటికల్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

**బీఆర్ఎస్‌పైకి పీజేఆర్ అస్త్రం!..**

జూబ్లీహిల్స్ బై పోల్‌లో (Jubilee Hills By poll) కేంద్రంగా కవిత బీఆర్ఎస్‌కు ట్విస్ట్ ఇవ్వబోతున్నారనే టాక్ వినిపిస్తోంది. మరోవైపు ఇక్కడ గెలిచేందుకు కేటీఆర్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇప్పటికే వరుస సమావేశాలు నిర్వహిస్తూ మాగంటి గోపీనాథ్ సతీమణి సునీతనే అభ్యర్థి అనే సంకేతాలను సైతం ఇచ్చేశారు. ఈ తరుణంలో జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే విష్ణు కవితతో సమావేశం కావడం బీఆర్ఎస్ శ్రేణులను విస్మయానికి గురి చేస్తోంది. దీంతో జూబ్లీహిల్స్ బై పోల్ విషయంలో బీఆర్ఎస్‌పై కవిత పీజేఆర్ అస్త్రాన్ని ప్రయోగించబోతున్నారా? అనే చర్చ జరుగుతోంది. అదే జరిగితే జూబ్లీహిల్స్ పోరు మరింత రసవత్తరంగా మారనుంది.



### రూ. 10 కోట్లకు బండి సంజయ్‌పై

## కేటీఆర్ పరువు నష్టం దావా

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రూ.10 కోట్ల పరువు నష్టం దావా వేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనపై బండి సంజయ్ ఎటువంటి ఆధారాలు లేకుండా తీవ్రమైన ఆరోపణలు చేశారని, దీనివల్ల తన ప్రతిష్ఠకు భంగం కలిగిందని ఆరోపిస్తూ కేటీఆర్ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టును ఆశ్రయించారు.

తనపై చేసిన ఆరోపణలకు సంబంధించి బేషరతుగా క్షమాపణ చెప్పాలని కోరుతూ కేటీఆర్ తరఫు న్యాయవాదులు ఆగస్టు 11న బండి సంజయ్‌కు లీగల్ నోటీసు పంపారు. అయితే, ఆ నోటీసులకు బండి సంజయ్ స్పందించకపోవడంతో పాటు, క్షమాపణ చెప్పడానికి నిరాకరించడంతో కేటీఆర్ న్యాయపోరాటానికి దిగారు. ఈ క్రమంలోనే ఆయన సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఈ దావాలో కేటీఆర్ పలు కీలక విషయాలను ప్రస్తావించారు. బండి సంజయ్ తనపై చేసిన ఆరోపణలకు గాను బేషరతుగా, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో తన పరువుకు నష్టం కలిగించేలా ఎటువంటి వ్యాఖ్యలు, ప్రసంగాలు, ప్రచురణలు చేయకుండా బండి సంజయ్‌ను నిరోధిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. అలాగే, ఇప్పటికే ఆన్‌లైన్ వేదికలు, సామాజిక మాధ్యమాలు, ఇతర వార్తా మాధ్యమాలలో ఉన్న పరువు నష్టపరిచే కథనాలు, వీడియోలు, పోస్టులను తక్షణమే తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు.

## పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలి

- **10 మంది కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆయన దృష్టికి తీసుకువెళ్లిన బీఆర్ఎస్**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ సభాపతికి విజ్ఞప్తి చేసినట్లు తెలంగాణ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత జగదీశ్ రెడ్డి వెల్లడించారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు శాసనసభ ప్రాంగణానికి వెళ్లి శాసనసభ అదనపు కార్యదర్శి ఉపేందర్ రెడ్డిని కలిశారు.

బీఆర్ఎస్ పార్టీ నుంచి 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. పార్టీ ఫిరాయింపులకు పాల్పడిన వారిపై మూడు నెలల్లోపు నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసిందని శాసనసభ అదనపు కార్యదర్శికి తెలియజేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణను అధికారులు తమకు తెలియజేశారని, వారి వివరణపై బీఆర్ఎస్ పార్టీ నిర్ణయాన్ని తెలియజేయడానికి మూడు రోజులు గడువు ఇచ్చారని జగదీశ్ రెడ్డి మీడియాకు తెలిపారు.

# కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది?..

**మొదటిపేజీ తరువాయి**

ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం.

అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం''అని స్పష్టం చేశారు. జాతీయ జెండా ఎగరనీయబోమని, ఎన్నికలే జరపనీయబోమని ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పాలంటూ ప్రశ్నించారు. రాష్ట్రంలో యూరియా కొరతకు ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. సరైన ప్రణాళిక లేకపోవడం, యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా చర్యల్లేకపోవడంవల్లే ఈ దుస్థితి తలెత్తిందని చెప్పారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ వద్ద ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథరావులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. ఏమన్నారంటే...

ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు ఇవ్వకపోవడం వల్ల రాష్ట్రంలోని 15 నుండి 20 లక్షల మంది విద్యార్థుల జీవితాలు నాశనమయ్యే పరిస్థితి ఏర్పడింది. గత పదేళ్లపాటు కేసీఆర్ ఫీజు రీయంబర్స్ మెంట్ ఇయ్యక తిప్పలు పెట్టారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కు బ్రాండ్ అంబాసిడర్ మేమేనని ఇన్నాళ్లు సంకలు గుద్దుకున్న కాంగ్రెసోళ్లు 20 నెలలుగా ఆ బకాయిలియ్యకుండా మోసం చేస్తున్నరు. ? కేసీఆర్ కు, మీకు తేడా ఏముంది? పంజాబ్ పోయి చెక్కులిచ్చి బౌన్స్ చేసి తెలంగాణ పరువును బజారున పడేస్తే.... ఈ కాంగ్రెసోళ్లు టోకెన్ల మీద టోకెన్లు ఇస్తూ మోసం చేస్తున్నరే తప్ప పైసా ఇయ్యడం లేదు. కాంగ్రెస్ నమ్మిన పాపానికి పెనం మీద నుండి పొయ్యిలో పడ్డట్లయింది.

ఫీజు రీయంబర్స్ మెంట్ పై ఆధారపడి ఈ రాష్ట్రంలో ఏటా 15 లక్షల మందికిపైగా పేద విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, మెడికల్, ఎంబీఏ, ఎంసీఏ



వంటి ఉన్నత కోర్సులను చదువుకుంటున్నరు. నాలుగైదు ఏళ్లుగా ఫీజు రీయంబర్స్ మెంట్ పైసలు చెల్లించకపోతే వాళ్ల పరిస్థితి ఏంది? ఫీజు రీయంబర్స్ మెంట్ ఉందనే ఉద్దేశంతోనే ఉన్నత విద్యా కోర్సుల్లో చేరిన విద్యార్థులు ఇయాళ నడిరోడ్డున పడ్డరు. ఫీజుల కట్టకపోవడంవల్ల కాలేజీలు మెడపట్టి బయటకు నెట్టేస్తున్నయి. ఫోర్త్ సిటీ, మూసీ సుందరీకరణ, మిస్ వరల్డ్ పోటీల పేరుతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నరు కదా?... పేద విద్యార్థుల కోసం రూ.8 వేల కట్టలేరా? కాలేజీలు బంద్ అయితే విద్యార్థులు ఎటు పోవాలి? ఏం చదువుకోవాలి? వాళ్ల భవిష్యత్తును రోడ్డున పడేస్తారా?

ఇదేనా ఇందిరమ్మ రాజ్యమంటే? కాలేజీ యాజమాన్యాలకు ఆనాడే చెప్పిన. కాంగ్రెస్ టోకెన్ల పేరుతో మోసం చేస్తదే తప్ప మీ గోడు పట్టించుకోదని. ఆనాడు చర్చలకు వెళ్లి వాళ్ల మాటలు నమ్మి కాలేజీ యాజమాన్యాలు మోసపోయాయి. కాలేజీ యాజమన్యాల్లో కొందరు కాంగ్రెస్ తొత్తులు ఉన్నందునే వాళ్లకు ఈ దుస్థితి ఏర్పడింది. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. తక్షణమే ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా. పేదోడు తెలంగాణలో బతకాలంటే భయమైతుంది. రోగమొస్తే కూడా పట్టించుకునే నాథుడే లేకపాయే... ఆరోగ్యశ్రీ పథకం కూడా మాదేనని జబ్బలు చర్చుకున్న కాంగ్రెసోళ్లు ఆరోగ్యశ్రీ బకాయిలు ఇవ్వకపోవడంతో రోగులను ప్రైవేట్ ఆసుపత్రులకు రానీయ్యడం లేదు. ఆరోగ్యశ్రీ పైసలియ్యనిదే ఆసుపత్రుల్లోకి అడుగు పెట్టనిచ్చేదే లేదని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులోళ్లు తెగేసి చెబుతున్నరు. పోనీ సర్కారు దవాఖానాకైనా పోదామంటే సూది లేకపాయే, మందు బిళ్లలు కూడా లేకపాయే. మరి ఏం చేయాలే.... పేదోడికి రోగమొస్తే చావాల్సిందేనా? ఇందుకోసమేనా? కాంగ్రెస్ కు ఓటేసి గెలిపించింది? ప్రజా సమస్యలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ స్పందించవు. ఏమైనా అంటే కాళేశ్వరం, డ్రగ్స్, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల స్కాం అంటూ రచ్చ చేస్తూ ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నయ్.

రైల్వే స్టేషన్ల అభివృద్ధి పేరుతో అదానీ, అంబానీలకు కట్టబెట్టాలని చూస్తున్నారంటూ కమ్యూనిస్టులు చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా....అభివృద్ధిపై కాకుండా అడ్డగోలుగా మాట్లాడుతున్నారు కాబట్టే కమ్యూనిస్టులు కాలగర్భంలో కలిసిపోయారు. అభివృద్ధి కోసం పనిచేస్తున్నాం కాబట్టే 2 సీట్ల నుండి కేంద్రంలో వరుసగా 3 సార్లు అధికారంలోకి వచ్చినం.

**నక్సల్స్ ఎన్ కౌంటర్ పై అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ...**

నక్సల్స్ చంపింది ఎవరిని? పేదలు, ఆదివాసీ బిడ్డలనే కదా? మావోయిస్టులను సమర్థించే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చిట్టెం నర్సిరెడ్డి, శ్రీపాదరావు, రాగ్యానాయక్ సహా ఎంతో మందిని నక్సల్స్ చంపారు. డ్యూటీ చేస్తున్న పోలీసులను కూడా నక్సల్స్ పొట్టనపెట్టుకుంటున్నారు కదా? పొట్ట కూటి కోసం డ్యూటీ చేస్తున్న వాళ్లను చంపితే మాట్లాడరా? చనిపోయినోళ్లంతా ప్రజలే కదా? తెలుగు వాళ్లే కదా?

దేశాన్ని రక్షించే ఆర్మీ, చట్టాన్ని కాపాడే పోలీసుల చేతుల్లోనే తుపాకీ ఉండాలి. అట్లా కాకుండా పర్మిషన్ లేకుండా ఎవరి చేతిలో తుపాకీ ఉన్నా సంఘ విద్రోహ శక్తిగానే భావిస్తాం. అందుకే తుపాకీ విడిచి లొంగిపోవాలని కోరుతున్నాం. అట్లా కాకుండా తుపాకులతో మేం కాలుస్తూనే ఉంటాం... మీరు మాత్రం చర్చలకు పిలవాల్సిందేనంటే వినే పిరికిపంద ప్రభుత్వం మాది కాదు. నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అమిత్ షా నాయకత్వంలో 2026 మార్చి నాటికి మావోయిస్టులను పూర్తిగా నిర్మూలించి తీరుతాం. జాతీయ జెండా ఎగరనీయని, ఎన్నికలే జరపనీయని, ఆదివాసీ అమాయకబిడ్డలను చంపేటోళ్లను ఏమనాలి? ఏ దేశపోళ్లు అనాలే... మీరే చెప్పండి.

గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా ఇవ్వని కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించే దమ్ములేక రకరకాల సాకులు చెబుతోంది. గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులిస్తోంది కేంద్రమే. అయినా కేంద్రం ఏమీ ఇవ్వడం లేదని తిట్టడం సిగ్గుచేటు. రబీ సీజన్ లో 12 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను పంపితే... 2.05 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా మిగిలింది. ఆ యూరియాను ఏం చేశారో చెప్పడం లేదు. పంపిణీ చేసిన యూరియాను ప్లాన్ ప్రకారం సరఫరా చేయడం లేదు. పైగా యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలిస్తున్నా పట్టించుకోరు. నిన్ననే మిర్యాలగూడలో ఎమ్మెల్యే గన్ మెన్ లారీ యూరియాను బ్లాక్ మార్కెట్ కు తరలించబోవడమే ఇందుకు నిదర్శనం. అసలు కాంగ్రెస్ కు ప్లానే లేదు. రబీ యూరియా వినియోగంపై లెక్కా పత్రం లేదు. ఇదేమని అడిగితే... కేంద్రాన్ని బదనాం చేయడమే పెట్టుకున్నరు. ఇకనైనా కేంద్రాన్ని బదనాం చేయడం పక్కనపెట్టి యూరియా విషయంలో రైతులు పడుతున్న బాధను అర్థం చేసుకుని ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలని కోరుతున్నా అని తెలిపారు.

## ఒక ఇంట్లో ఉన్నప్పుడు చిన్నచిన్న గొడవలు సహజం.. బజారున పడొద్దు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

"ఒక ఇంట్లో ఉన్నప్పుడు చిన్నచిన్న గొడవలు సహజం. వాటిని సామరస్యంగా పరిష్కరించుకోవాలి కానీ, బజారున పడి కొట్లాడుకోవద్దు. కలిసికట్టుగా పనిచేయాలి" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. జూబ్లీహిల్స్‌లో పార్టీ కార్యకర్తలతోజరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ నగరం అనాథగా మారిందని, నగరాన్ని పట్టించుకునే నాథుడే కరవయ్యాడని తీవ్రంగా ధ్వజమెత్తారు.

వర్షాలకు నగరంలో ముగ్గురు యువకులు కొట్టుకుపోయి మరణిస్తే వారిని పరామర్శించేందుకు ఒక్క మంత్రి కూడా రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల కోసం ముగ్గురు మంత్రులను నియమించిన ప్రభుత్వం, వర్షాలతో ఇబ్బందులు పడుతున్న ప్రజల కోసం ఎందుకు స్పందించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. తాము 36 ఫ్లైఓవర్లు నిర్మిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం రోడ్ల మీద గుంతలు కూడా పూడ్చలేని దుస్థితిలో ఉందని విమర్శించారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపుతప్పాయని, నేరాల రేటు 41 శాతం పెరిగిందని ఆరోపించారు. చందానగర్‌లో పట్టపగలే ఒక నగల దుకాణంలో దోపిడీ జరగడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రారంభించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని తాము కొనసాగిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు లేవని చెప్పి దాన్ని మూసివేసిందని కేటీఆర్ మండిపడ్డారు.

ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటనతో 13 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందన్నారు. మిర్యాలగూడ కాంగ్రెస్ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి గన్‌మన్ ఒక లారీ యూరియాను బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకున్నాడని, గన్‌మనే ఇలా చేస్తే ఇక ఎమ్మెల్యే ఎంత అవినీతికి పాల్పడి ఉంటారో అర్థం చేసుకోవచ్చని ఆరోపించారు.

కేసీఆర్ హయాంలో లక్ష మందికి ఇంటి పట్టాలు ఇస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వేల ఇళ్లను కూలగొట్టిందని, ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా అని కేటీఆర్ నిలదీశారు. ఉపఎన్నికల తర్వాత ఇప్పుడు తిరుగుతున్న మంత్రులెవరూ కనిపించరని, ప్రజల కష్టాల కోసం పోరాడేది కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు.






### ప్రైవేట్ కాలేజీలు

## మూతపడే పరిస్థితి

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల కారణంగా ప్రైవేట్ కాలేజీలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు విమర్శలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాల నిర్ణయానికి బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఫీజు రీయింబర్స్ మెంట్ లేక ప్రైవేట్ యాజమాన్యాలు రోడ్డున పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వానికిస్పష్టత కొరవడిందని మండిపడ్డారు. ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లిన సీఎం రూ.వందల కోట్లు రిలీజ్ చేస్తామని అన్నారని, కానీ రీయింబర్స్ మెంట్ బకాయిలు మాత్రం విడుదల చేయడంలేదని ఫైరయ్యారు. తక్షణమే ఈ బకాయిలు మంజూరు చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థపై ప్రభుత్వ నిర్లక్షాన్ని ఆయన ఖండించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయలు రూ.8 వేల కోట్లు పైగా ఉన్నప్పటికీ, రెండేళ్లుగా ఒక్క పైసా కూడా విడుదల చేయలేదని ఆయన విమర్శలు చేశారు. విద్యా వ్యవస్థను కాపాడడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయలు రిలీజ్ చేయడంతో పాటు కొత్త భవనాల నిర్మాణం వేగవంతం చేయాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు.

# తెరపైకి కేసీఆర్ విజిలెన్స్ రిపోర్టు?

- **ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై సీఎం రేవంత్ కీలక చర్చలు**
- **బీఆర్ఎస్ కాలంలో సిద్ధమైన విజిలెన్స్ రిపోర్ట్ వెలికితీత**
- **ప్రైవేట్ కాలేజీల అవకతవకలపై విద్యార్థి సంఘాల ఆందోళన**
- **నకిలీ సిబ్బంది, సౌకర్యాల లోపంపై ప్రభుత్వ ఆరా**



**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్:**

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు అంశం మరోసారి హాట్‌టాపిక్‌గా మారింది. ఈ విషయంలో సీఎం ఏ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు కలిసి కీలకంగా చర్చించారు. ప్రభుత్వానికి అందిన సమాచారం ప్రకారం, గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో సిద్ధమైన విజిలెన్స్ రిపోర్ట్‌ను తిరిగి పరిశీలించాలని నిర్ణయం తీసుకున్నారు. ఆ రిపోర్ట్‌లో అనేక ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీలు నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా, విద్యార్థులకు సౌకర్యాలు కల్పించకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని లాభాల కోసం వినియోగించుకున్నట్లు స్పష్టంగా తేలినట్టు తెలుస్తోంది.

విద్యార్థి సంఘాలు కూడా ఈ రిపోర్ట్‌ను వెంటనే బహిర్గతం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. కాలేజీలు విద్యా ప్రమాణాలను విస్మరించి బకాయిల చెల్లింపుల పేరుతో ప్రభుత్వాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాయంటూ విద్యార్థి సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. నకిలీ సిబ్బందిని చూపించి అనుమతులు పొందడం, సౌకర్యాలు కల్పించకుండా కోట్లు దాచుకోవడం, తనిఖీలు తూతూమంత్రంగానే జరగడం వంటి అంశాలను వారు ప్రస్తావిస్తున్నారు. అంతేకాకుండా, కోట్ల రూపాయల నిధులు కాలేజీ యాజమాన్యాల మధ్య చేతులు మారుతున్నాయంటూ ఆరోపణలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం విజిలెన్స్ రిపోర్ట్‌ను సమగ్రంగా పరిశీలించేందుకు సిద్ధమవుతోంది. అవసరమైతే అక్రమాలకు పాల్పడిన కాలేజీలపై కఠిన చర్యలు తీసుకోవచ్చని సంకేతాలు ఇస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుల చర్చలు ఈసారి ఎటువంటి నిర్ణయానికి దారితీస్తాయో విద్యార్థులు, కాలేజీలు, తల్లిదండ్రులు ఆసక్తిగా గమనిస్తున్నారు.



# ఇంతవరకు పింఛన్లు పెంచలేదు

- **ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మార్పీఎస్ నాయకుడు పెంటనోళ్ళ నరసింహ మాదిగ**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 15) :**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా ఇంతవరకు పింఛన్లు పెంచలేదని, దొంగ హామీలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్రాన్ని పాలించే హక్కు లేదని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పెంటనోళ్ల నరసింహ మాదిగ హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి కార్యక్రమం సందర్భంగా ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నరసింహ మాదిగ కార్యాలయంలోకి చొచ్చుకొని పోయేందుకు ప్రయత్నించగా ఎస్సైలు సుశీల రామచంద్రయ్య తదితర సిబ్బంది అతని బలవంతంగా అడ్డుకొని అదుపులోకి తీసుకున్నారు. డిమాండ్లతో కూడిన తమ వినతి పత్రాన్ని తాసిల్దార్ కు ఇస్తామని ఎలాంటి ఉదిత్తత పరిస్థితులు నెలకొనకుండా చూస్తామని నరసింహ మాదిగ పోలీసులను కోరడంతో స్థానిక అధికారి నాగయ్యను పిలిచి వినతిపత్రం అందేలా చూశారు. ఈ సందర్భంగా నరసింహ మాదిగ మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసిన సామాజిక న్యాయ పరివర్తకుడు, దళిత జాతి ముద్దుబిడ్డ, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈ నెల 15వ తేదీన పింఛన్ల పెంపు కొరకు తలపెట్టిన ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపు ఇవ్వడంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా ఇంతవరకు పింఛన్లు పెంచలేదని, ప్రస్తుతం ఉన్న రూ.2,000 పింఛన్‌ను రూ.4,000 చేస్తామని, వికలాంగులకు, దివ్యాంగులకు, వితంతువులకు రూ.3,000 నుంచి రూ.6,000 పెంచుతామని, అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. పింఛన్ల పెంపు కోసం ప్రతి గ్రామం నుంచి ముసలివారు, వితంతువులు, దివ్యాంగులు అధిక సంఖ్యలో ఎమ్మార్వో కార్యాలయం ముట్టడి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేశారు.ఈ కార్యక్రమంలో పెంటనోళ్ళ నరసింహ మాదిగ కల్లేపల్లి బాలరాజు మాదిగ, నాగభూషణ్ మాదిగ ఎమ్మార్పీఎస్ కులాల మండలం అధ్యక్షులు, నార్ కుంట మహేందర్ మాదిగ, సంగెం శ్రీనివాస్ మాదిగ, ఎర్రోళ్ల సురేష్ మాదిగ, విట్యాల యాదగిరి మాదిగ, చింతకాయల వెంకటేష్ మాదిగ, రాఘవేంద్ర మాదిగ, సత్యం మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# విద్య, వైద్యం, ఉద్యోగం లక్ష్యంతో ముందుకెళ్తున్న

- **రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాగూర్**

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ. (సెప్టెంబర్ 15):**

గడీల పాలన పోయి, ప్రజాప్రభుత్వం వచ్చిందని, ఈ ప్రభుత్వం విద్య, వైద్యం, ఉద్యోగం లక్ష్యాలతో రాష్ట్రాభివృద్ధి వైపుకు అడుగులు వేస్తుందని రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజ్ ఠాగూర్ అన్నారు. సోమవారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 8వ కాలనీ లోని హనుమాన్ నగర్ లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో పాల్గొని, హనుమాన్ నగర్ తో పాటు, అల్లూరు, రాజీవ్ నగర్, సంతోష్ నగర్, ఇందిరానగర్ డివిజన్లకు కలిపి 197.65 లక్షల ట్రాన్స్ ఫర్ డ్యూటీ నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీల నిర్మాణపు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన స్థానిక ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. 50 ఏళ్లుగా వెనుకబడి ఉన్న రామగుండం నియోజకవర్గాన్ని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, ఐటీ మంత్రి శ్రీధర్ బాబు ల సహకారంతో అభివృద్ధి దిశగా తీసుకెళ్లే సంకల్పంతో ముందుకు వెళ్తున్నానని, ఇందుకు నియోజకవర్గ ప్రజల ఆదరణ అండ ఉండాలని కోరారు. ఇక ఈ నిర్మాణ పనులు పూర్తయ్యాక ప్రజల ఆరోగ్య పరిరక్షణకై, అహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు, మురికి నీటి సమస్యను నివారించేందుకు ఈ నిర్మాణం ఉపయోగ పడుతుందన్నారు. అలాగే 20 కోట్ల రూపాయల నిధులతో కాలనీ, సెంటినరీ కాలనీ మంథని ప్రధాన రహదారి వరకు సెంటర్ లైటింగ్ విధానంతో ఫోర్ వే నిర్మాణం జరుగుతుందని అందుకు అవసరమైన టెండర్లు కూడా పూర్తి అయ్యాయని అన్నారు. నియోజకవర్గంలో త్రాగునీరు సమస్య అనేది లేకుండా 22 కోట్ల రూపాయల నిధులతో నీటి సరఫరా పనులు కూడా కొనసాగుతున్నాయన్నారు. 300 కోట్ల రూపాయల నిధులతో అన్ని రకాల సౌకర్యాలతో ప్రభుత్వాసుపత్రి నిర్మాణం, అలాగే గుండె వ్యాధులకు సకాలంలో చికిత్స అందించేందుకు గాను ఒక ప్రత్యేక విభాగం నిర్మాణం కూడా చేపట్టడం జరుగుతుందన్నారు. ఒకప్పుడు ఉద్యోగం ఉపాధి లభించే రామగుండం నియోజకవర్గాన్ని, గత కెసిఆర్ ప్రభుత్వం సింగరేణి బొందల గడ్డగా మార్చిందని, ఇక కాంగ్రెస్ ప్రభుత్వం నియోజకవర్గాన్ని రాబోయే 50 ఏళ్ల వరకు అభివృద్ధికి దిక్సూచిగా నిలిపే సంకల్పంతో ఉందన్నారు. నియోజకవర్గం ప్రజలు ఆశిస్తున్న అభివృద్ధికి అనుగుణంగా ఇప్పటివరకు కొంతవరకు మార్పు వచ్చిందని, ముందు ముందు మరింత మార్పు ఈ ప్రాంతంలో జరుగుతుందన్నారు. ప్రజలకు మేలు చేకూర్చే ప్రతి అభివృద్ధి పనికి కట్టుబడి ఉంటానని, రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమం దిశగా మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే న్యూ మారడుపాక, గోపాల్ నగర్ లలో కూడా ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. ఇక వేరువేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ జల్ద,అరుణ శ్రీ, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మారెల్లి రాజిరెడ్డి, కాలనీ పట్టణ అధ్యక్షులు గుండేటి రాజేష్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యాక్షులు ఇరికి మహేష్, కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, మాజీ కార్పొరేటర్ బి శంకర్ నాయక్, నాయకులు జక్కుల దామోదర్, యాదగిరి తిరుపతి, మల్లారెడ్డి తిరుపతిరెడ్డి, సి.హెచ్.సదానందం, సాగంటి శంకర్, మార్కరాజు, పరకాల ప్రశాంత్ గౌడ్, ఇరికి రాజేశ్వరి, మారం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోలర్ స్కేటింగ్ స్పీడ్ ఛాంపియన్‌షిప్‌లో కేశవ్ చౌహాన్ విజయం

**జర్నలిస్ట్ డైరీ, యాచారం(సెప్టెంబర్ 15):**

రంగారెడ్డి జిల్లాలోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో 2025 రోలర్ స్కేటింగ్ స్పీడ్ ఛాంపియన్‌షిప్ ఘనంగా జరిగింది. ఈ పోటీల్లో అనేక మంది క్రీడాకారులు తమ ప్రతిభను చాటగా, యాచారం మండలం తక్కలపల్లి తాండకు చెందిన సభావత్ హనుమంతు తనయుడు సభావత్ కేశవ్ చౌహాన్ (7) అద్భుత ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించాడు. కఠినమైన పోటీలో తన వేగం, నైపుణ్యంతో కేశవ్ మూడవ స్థానాన్ని సాధించి విజేతగా నిలిచాడు. కేశవ్ విజయం కుటుంబ సభ్యులు, స్నేహితులను ఆనందంలో ముంచెత్తింది. ఈ ఛాంపియన్‌షిప్‌లో కేశవ్ చూపిన చాకచక్యం, సమర్థత అందరినీ ఆశ్చర్యపరిచాయి. నిర్వాహకులు అతడి ప్రదర్శనను ప్రశంసిస్తూ, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కేశవ్ సాధన, అంకితభావం యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకంగా నిలిచాయి. ఈ విజయం యాచారం మండలానికే గర్వకారణమని స్థానికులు అభినందనల జల్లు కురిపిస్తున్నారు.



## అర్హత ఉన్నా వికలాంగులకు దక్కని

# ఇందిరమ్మ ఇల్లు

- **కందివనం, మొగిలిగిద్దలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ**
- **చెక్కులు అందజేసిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 15) :**

ఫరుక్ నగర్ మండలం కందివనం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు రాని అర్హులైన వికలాంగుల కోరిక మేరకు వారి గృహాలలో పర్యటించారు ఎమ్మెల్సి నవీన్ రెడ్డి.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో అభాగ్యులకు మరియు వికలాంగులకు కూడా ఇండ్లు ఇయ్యలేకపోయారని అర్హత ఉన్న కూడా ఇల్లు ఇవ్వకుండా రాజకీయ కక్షకు పాల్పడుతున్నారని ఇకమీదటైనా వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇండ్లను ఇవ్వాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు ఎమ్మెల్సి నవీన్ రెడ్డి. అదేవిదంగా కందివనం గ్రామానికి చెందిన వడ్డే పాండు మరియు మొగలిగిద్ద గ్రామానికి చెందిన రాగపురం ప్రశాంత్ లకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసు ద్వారా మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల గ్రామానికి వెళ్లి స్థానిక నాయకుల చేతుల మీదుగా అందజేశారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి. కందివనం గ్రామంలో దూస మల్లేష్ చిన్న కుమారుడు ప్రమాదవాష్యత్తు ఇటీవలి కాలంలో చెరువులో పడి మృతి చెందిన కారణంగా వారి ఇంటికి వెళ్లి దూస మల్లేష్ కు మనోదైర్యం కల్పించారు. అలాగే గ్రామానికి 105 ఏండ్ల పిడికిరాల బాలమ్మను కలిసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు ఎమ్మెల్సి నవీన్ రెడ్డి.అలాగే మొగిలిగిద్ద గ్రామానికి చెందిన ఆర్ఎంపి డాక్టర్ అంజయ్య వాళ్ళ అక్క సత్యమ్మ ఇటీవల కాలంలో మరణించిన కారణంగా వారి నివాసనికి వెళ్లి అంజయ్యకు మనోదైర్యం కల్పించారు.ఈ కార్యక్రమంలో కొందుర్గు జడ్పిటిసి తనయుడు రామకృష్ణ, మొగిలిగిద్ద మాజీ ఎంపిటిసి రాధాకృష్ణ,కందివనం మాజీ సర్పంచులు శివ జ్యోతి, అమృనాయక్,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎల్లికట్ట శేరి శ్రీనివాస్ రెడ్డి,కంది వనం గ్రామ కమిటీ అధ్యక్షులు శంకరయ్య గౌడ్, కంటెస్టెంట్ సర్పంచ్ శివ శంకర్, నాయకులు గోపాల్ గౌడ్, ఆంజనేయులు,వెంకట్ రెడ్డి, కుర్వ పెంటయ్య, రాజు, అన్వారీ రాజు తదితరులు పాల్గొన్నారు.







# సంస్థ పరిరక్షణ, హక్కుల సాధనే ఏఐటీయూసీ లక్ష్యం

- **ఏరియా కార్యదర్శి జి. రవీందర్.**

**జర్నలిస్ట్ డైరీ, యైటింక్లయిన్ కాలనీ. (సెప్టెంబర్ 15):**

సంస్థ పరిరక్షణ, హక్కుల సాధన లక్ష్యంగా ఎంచుకున్న తమ యూనియన్, సింగరేణిలో గుర్తింపు పొందినప్పటి నుండి నేటివరకు, కేవలం రెండవ ఏరియాలో 45 హక్కులను అమలు చేయించినట్లు, గుర్తింపు సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసీ) ఏరియా కార్యదర్శి జిగురు రవీందర్ అన్నారు. సోమవారం ఉదయం స్తానిక ప్రెస్ భవన్ లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణి కార్మికులకు విద్య, వైద్యం, వసతులు, సంక్షేమం, సంరక్షణ ల విషయంలో ఏఐటీయూసీ ఎప్పుడూ ముందుంటుందని, వాటి సాధన కొరకు ఏ పోరాటానికైనా సిద్ధంగా ఉంటుందన్నారు. ఇక ఏరియా కార్మికులకు సాధించి పెట్టిన హక్కుల్లో భాగంగా, ఏరియాలో అర్హత కలిగిన జనరల్ మజ్దూర్లకు 2024 లో 76 మందికి హెచ్.ఈ.ఎం.ఎం పదోన్నతులు, అలాగే అదే సంవత్సరంలో 17 మందికి, 2025 లో 22 మందికి గ్రీస్ హెల్పార్లుగా పదోన్నతులు ఇప్పించడం జరిగిందన్నారు. ఓసీపీ.3 ప్రాజెక్టు కార్మికులకు బోజన సదుపాయం, కృషి భవన్ డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్ద, ఉద్యోగ విరమణ కార్యక్రమాల నిర్వహణ కొరకు షెడ్ల నిర్మాణాలు ఏఐటీయూసీ కృషివల్లనే జరిగాయన్నారు. ప్రాజెక్టు కృషి భవన్ ఆధునీకరణ చేయించడం, ఓసీపీ.1 ప్రాజెక్టు నుండి మణుగూరు ఏరియాకు బదిలీ చేసిన 18 మంది ఈపి ఆపరేటర్ల తమ నాయకులు సీతారామయ్య బదిలీ రద్దు చేయించారని, స్తానిక సెక్టార్.3 డిస్పెన్సరీ లో 3 పడకలు ఉండగా, మరో 10 పడకలను అదనంగా ఏర్పాటుకు, అలాగే హెచ్.బి.ఏ 1 సి షుగర్ టెస్ట్ వసతి, ఫిజియో థెరపీ సౌకర్యం కల్పనకు కృషి చేసింది కూడా ఏఐటీయూసీ యూనియన్ మాత్రమే అన్నారు. అలాగే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని కాలనీ కుటుంబాల అవసరాలమేరకు వకీల్ పల్లి గని నుండి ఫిల్టర్ బెడ్ కు రెండు పైప్ లైన్లు ఏర్పాటు, సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో లేని విధంగా పోతన కాలనీలో భారీ కమ్యూనిటీ హాలు నిర్మింప చేశామని తెలిపారు. ఓసీపీ.3 ప్రాజెక్టుకు 6.5 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగిన 5 కొత్త షావెల్స్, 3 క్యూబిక్ మీటర్ల సామర్థ్యం కలిగిన ఒక షావెల్ ను తెప్పించడం జరిగిందన్నారు. ఏరియా వర్క్ షాప్ ఉద్యోగులకు మధ్యాహ్నం, రాత్రి, భోజన సమయాలను ఇప్పించామన్నారు. 7 ఎల్.ఈ.పి గని ప్రమాదంలో మరణించిన ఉద్యోగి సత్యనారాయణ కుటుంబానికి 24 గంటల్లో ఎక్స్గ్రేషియా స్పెషల్ ఎక్స్గ్రేషియా ఇప్పించింది కూడా ఏఐటీయూసి మాత్రమేనన్నారు. తమ యూనియన్ ఇలా ఏరియా కార్మికులకు అనునిత్యం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తూ, వారి న్యాయమైన హక్కులను అమలు చేయించడం జరుగుతుందని ఆయన వివరించారు. ఇంకా ఈ సమావేశంలో నాయకులు ఎల్.ప్రకాష్, కే. రాజరత్నం, బి.అన్నారావు, ఎం.మహేందర్, ఎ. రవికుమార్, బుర్ర తిరుపతి, కె. కుమారస్వామి, కొండ్ర సత్యనారాయణ, మదన్ మోహన్, సాదరి రమేష్, నారాయణ, గట్టయ్య, సంపత్ రెడ్డి, శ్రీనివాస్, లక్ష్మయ్య, వీరస్వామి, మల్లేశ్, శ్రీనివాస్, చంద్రయ్య, కిరణ్, మహేందర్, శంకర్, అక్రమ్, విజయ్, శ్రీనివాస్, రాజేందర్, రాజ్ కుమార్ లు పాల్గొన్నారు.





# ఉపాధ్యాయ రంగంలో జనార్ధన్ రెడ్డి సేవలు మరువలేనివి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 15 ) :**

రంగారెడ్డి జిల్లా, ఫరూక్ నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలోని స్థానిక ఠాకూర్ ఫంక్షన్ హాల్ లో ఉపాధ్యాయులు జనార్ధన్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరై జనార్ధన్ రెడ్డి దంపతులను సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. జనార్ధన్ రెడ్డి గారి సేవలు మరువలేనివి ఎంతో మంది జనార్ధన్ రెడ్డి సార్ దగ్గర విద్యను అభ్యసించిన విద్యార్థులు ఎంతో మంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారని అని అన్నారు.

జనార్ధన్ రెడ్డి గారు మంచి ఆరోగ్యంగా ఉండాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటున్నానని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మోహన్ సింగ్, చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, చేగు సుధాకర్ అప్ప, రంగన్న గౌడ్,తదితరులు ఉన్నారు..

# దసరా కల్లా యాసంగి వరి బోనస్ జమ చేయాలి

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 15) :**



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన యాసంగి వరి పంట బోనస్ క్వింటాలుకు 500 రూపాయలు దసరా పండగలోపు రైతుల ఖాతాలో జమ చేయాలని బిజెపి కొందుర్గు మండల అధ్యక్షులు చిట్టెం లక్ష్మీకాంతరెడ్డి డిమాండ్ చేశారు. ధాన్యాన్ని సేకరించి నాలుగైదు నెలలు గడుస్తున్న ప్రభుత్వం రైతులకు చెల్లించాల్సిన బోనస్ ను విస్మరించిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ప్రాణ సంకటంగా మారిందని, ప్రభుత్వం ఇస్తామన్న ఏ హామీని సకాలంలో అందజేయక రైతులను అప్పుల కూపంలోకి నెట్టుతుందని దుయ్యబట్టారు. రైతు కన్నీరు పెట్టిన ఏ రాజ్యం బాగుపడదని రైతు ఉసురు ఊరికే పోదని, రైతు బాగుంటేనే మీ పొట్ట బాగుంటుందనేది గ్రహించాలని అన్నారు. బోనస్ డబ్బులు దసరాలోపు విడుదల చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ భూస్థాపితం చేస్తామని హెచ్చరించారు.



# శ్రీ బాలాజీ కృప ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో నిత్య అన్నదానం

- **నేటికి నెలరోజులు పూర్తి, ఆకలి తీర్చుతున్న అన్నదాత !**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 15 ) :**

ఆకలితో ఉన్నవారికి పట్టెడన్నం పెడితే ఎంతో పుణ్యం లాబిస్తుందని పెద్దలు భావిస్తారు. ఆ భావనతోనే తనకు తోచిన విధంగా ప్రభుత్వ ఆసుపత్రి నీ ఎంచుకున్నారు సుధీర్.

ప్రభుత్వ ఆసుపత్రికి సాధారణంగా పేద మధ్య తరగతి ప్రజలే వస్తారు. భోజనం కోసం రోగి మరియు వారి సహాయకులు పడే అవస్థలు అన్ని ఇన్ని కావు. కనీసం 100 రూపాయలు ఖర్చు పెడితే కానీ బయట భోజనం దొరకని పరిస్థితి ఇది గమనించిన శ్రీ బాలాజీ కృప ట్రస్ట్ నిర్వాహకులు శ్రీ సుధీర్, రోగులకు మరియు రోగి సహయకులకు ఒక పూట ఉచిత భోజన సదుపాయాన్ని కల్పించాలన్న సద్దుదేశంతో నిత్యాన్దాన కార్యక్రమాన్ని మొదలు పెట్టారు.. షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులు మరియు వారి సహాయకుల ఆకలి తీరుస్తున్నారు.

శ్రీ బాలాజీ కృప ట్రస్ట్ అనే స్వచ్ఛంద సంస్థ గత నెల ఆగష్టు 15 , 2025 షాద్నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎటువంటి లాభాపేక్ష లేకుండా వందలాది రోగులకు వారి బందువులకు ప్రతి రోజు నిత్యాన్నదానం చేస్తూ నిస్వార్థంగా శ్రీ బాలాజీ కృప ట్రస్ట్ సేవలు అందిస్తుంది.

ప్రతి రోజు 200 మంది రోగులకు, రోగి సహాయకులకు మరియు అనాధలకు సోమవారం నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం 12:45 నుండి 1:30 వరకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తూ ఆదర్శనంగా నిలుస్తున్నారు. సేవే పరమావధిగా ముందుకు సాగుతున్న శ్రీ బాలాజీ కృప ట్రస్ట్ ఉచిత భోజన సదుపాయాన్ని అభినందిస్తున రోగి మరియు రోగి సహాయకులు , ప్రభుత్వ అధికారులు మరియు ప్రజలు భోజనం చాలా బాగుంటుందని అంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేటికీ శ్రీ బాలాజీ కృప ట్రస్ట్ అన్నదానం ప్రారంభించి ఒక నెల పూర్తి అయింది,ఆకలితో ఉన్నవారికి కడుపునిండా ఆకలి తీర్చడంలో ఉన్నసంతోషం మాటల్లో చెప్పలేనిది అని , భగవంతుడి ఆశీర్వదంతో ఈ నిత్య అన్నదాన సేవ ఇలానే ముందుకు సాగాలని శ్రీ బాలాజీ కృప ట్రస్ట్ నిర్వాహకులు శ్రీ సుధీర్ అన్నారు.

# ఉద్యమకారుల సంక్షేమం కోసం అందరితో కలసి పనిచేస్తాం

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 15) :**

హైదరాబాద్ లో TJS రాష్ట్ర కార్యాలయంలో ప్రొఫెసర్ కోదండరాం గారి నాయకత్వంలో జరిగిన "తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ సమావేశం". జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం పోరాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల సంఘాలు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం, తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్, ఉద్యమకారుల ఐక్యవేదిక అన్ని సంఘాలు పాల్గొన్నారు గత పది సంవత్సరాల కాలంలో ఉద్యమకారులు అవమానాలు ఆర్థిక ఇబ్బందులు గురించి తమ ఆవేదనను ఉద్యమకారులు తెలియజేశారు. షాద్నగర్ ఉద్యమ నాయకుడు తెలంగాణ ఉద్యమకారుల వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాజీ జెడ్పిటిసి పి వెంకట్రాంరెడ్డి మాట్లాడుతూ... ఈ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీని అమలు చేయాలి అని, ఉద్యమకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు, 250 గజాల ఇంటి స్థలం మంజూరు చెయ్యాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో జస్టిస్ చంద్రకుమార్, చీమ శ్రీనివాస్, పల్లె వినయ్ కుమార్ , దారా సత్యం, అజయ్ మరియు తెలంగాణ ఉద్యమకారులు శ్రీనివాస్, యాదగిరి ఆంజనేయులు మొదలగువారు పాల్గొన్నారు.



# రాజధానిపై సజ్జల మాటల మర్మం: ఒక విశ్లేషణ



వే 2 న్యూస్ సదస్సులో వైఎస్సార్సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి రాజధానిపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ఘోర ఓటమి తర్వాత పార్టీ వైఖరిలో ఇది పెద్ద మార్పుగా కనిపిస్తోంది. "మళ్లీ అధికారంలోకి వస్తే అమరావతే ఏకైక రాజధాని. జగన్ అమరావతి నుంచే పాలిస్తారు" అని ఆయన స్పష్టంగా చెప్పారు. ఈ మాటలు వింటే, వైఎస్సార్సీపీ మూడు రాజధానుల విధానాన్ని పూర్తిగా వదిలేసిందని అనిపిస్తుంది. అయితే ఇది నిజమైన మార్పేనా? లేక రాజకీయ అవసరం కోసం వేసిన పిల్లిమొగ్గనా? సజ్జల మాటలను లోతుగా పరిశీలిస్తే, అందులో స్పష్టత కంటే గందరగోళమే ఎక్కువ కనిపిస్తుంది. పైకి అమరావతిని అంగీకరించినట్లే ఉన్నా, లోపల పాత వ్యతిరేకతే ధ్వనించింది.

సజ్జల తన ప్రధాన ప్రకటనకు కొన్ని మెలికలు పెట్టారు. అమరావతిలో ఇప్పుడున్న భవనాలు చాలని, కొత్త నిర్మాణాలు అవసరం లేదని అన్నారు. విజయవాడగుంటూరు మధ్య అభివృద్ధి చేస్తే సరిపోతుందని, అదే మచిలీపట్నం దాకా విస్తరించి మెగా సిటీ అవుతుందని ఒక కొత్త సిద్ధాంతం చెప్పారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని ముంచలేమని, ఆర్థిక బాధ్యత ముఖ్యమని నొక్కిచెప్పారు.

ఈ మాటల సారాంశం ఒక్కటే. రాజధానిగా అమరావతి పేరును అంగీకరిస్తారు, కానీ టీడీపీ ప్రభుత్వం ఊహించిన బృహత్తర ప్రణాళికను తిరస్కరిస్తారు. ఇది అమరావతిని అంగీకరించడం కాదు, దాని ఆత్మను వ్యతిరేకించడమే. ఇదే సదస్సులో సజ్జల చేసిన మరో వింత వాదన, తమ పార్టీ ఎప్పుడూ మూడు రాజధానులు అనలేదని, అదంతా "తప్పుడు ప్రచారం" అని చెప్పడం. ఇది పూర్తిగా చారిత్రక వాస్తవాలకు విరుద్ధం. వైఎస్సార్సీపీ ప్రభుత్వం మూడు రాజధానుల కోసం ప్రత్యేకంగా చట్టం చేసింది. స్వయంగా జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో, బయట ఎన్నోసార్లు ఆ విధానాన్ని సమర్థించారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో కూడా మూడు రాజధానుల హామీ ఇచ్చారు. ఐదేళ్ల పాటు తమ అధికారిక విధానంగా ప్రచారం చేసుకున్న అంశాన్ని ఇప్పుడు తప్పుడు ప్రచారం అనడం, రాజకీయంగా ఎంత నష్టం జరిగిందో అంగీకరించడమే.

వైఎస్సార్సీపీ వైఖరిలో ఈ ఆకస్మిక మార్పుకు అసలు కారణం 2024 ఎన్నికల ఫలితాలే. పార్టీ కేవలం 11 సీట్లకు పరిమితం కావడంతో , తమ విధానాలను పునఃసమీక్షించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు రాజధానుల విధానం ప్రజల్లోకి వెళ్లలేదని, రాజకీయంగా తమను దెబ్బతీసిందని పార్టీ గ్రహించింది. అందుకే ఇప్పుడు ప్రజా తీర్పును గౌరవిస్తున్నట్లు నటిస్తూ, అమరావతిని అంగీకరిస్తున్నారు. ఇది ఓటమి నుంచి పాఠాలు నేర్చుకోవడం కంటే, రాజకీయంగా మనుగడ సాగించడానికి వేసిన వ్యూహాత్మక ఎత్తుగడ. టీడీపీ చేతిలోని ప్రధాన అస్త్రాన్ని నిర్వీర్యం చేయాలనే తాపత్రయం ఇందులో స్పష్టంగా కనిపిస్తోంది.
మొత్తం మీద సజ్జల వ్యాఖ్యలను విశ్లేషిస్తే, ఇది మనస్ఫూర్తిగా వచ్చిన మార్పు కాదు. ఎన్నికల ఓటమి తర్వాత తప్పనిసరి పరిస్థితుల్లో తీసుకున్న రాజకీయ నిర్ణయం.

* సజ్జల ఏమన్నారు? అమరావతే రాజధాని అన్నారు. కానీ, కనీస అభివృద్ధి మాత్రమే ఉంటుందని షరతు పెట్టారు.
* స్పష్టత ఉందా? లేదు. రాజధాని పేరుపై స్పష్టత ఇచ్చినా, అభివృద్ధి ప్రణాళిక, గతంపై గందరగోళం సృష్టించారు.
* వైఖరిలో మార్పా? ప్రకటించిన విధానంలో ఇది కచ్చితంగా పెద్ద మార్పే. మూడు రాజధానుల విధానాన్ని వదిలేశారు.
* ఇది పిల్లిమొగ్గేనా? అవును. ఇది ఓటమి తర్వాత రాజకీయ మనుగడ కోసం వేసిన వ్యూహాత్మక పిల్లిమొగ్గే. ఇందులో సైద్ధాంతిక మార్పు కనిపించడం లేదు.

**నవీన్**
**సీనియర్ జర్నలిస్ట్**
**X ఖాతా నుంచి**

---



## ప్రధాని మోడీ 75వ పుట్టిన రోజు..
# దేశవ్యాప్తంగా సేవా పక్వాడ

- **సెప్టెంబర్ 17 తో 75 ఏళ్ళు పూర్తి చేసుకోనున్న ప్రధాని**
- **ఘనమైన ఉత్సవాలు సేవ పేరుతో మరింత ప్రజల్లోకి వెళ్లనున్న బిజెపి**

భారత ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్ 17న తన 75వ పుట్టినరోజు జరుపుకోబోతున్నారు. వరుసగా మూడోసారి ప్రధాని బాధ్యతలు స్వీకరించి రికార్డు సృష్టించిన మోడీ, దేశ రాజకీయ చరిత్రలో కీలక మలుపులు తిప్పిన నాయకుడిగా నిలిచారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ప్రత్యేకంగా సేవా పక్వాడ పేరుతో దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు – అంటే గాంధీ జయంతి, లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి వరకు – ఈ కార్యక్రమాలు జరగనున్నాయి.

### సేవా పక్వాడ లక్ష్యం

సేవా పక్వాడ కేవలం రాజకీయ వేడుక మాత్రమే కాదు. ప్రజలలో సేవాభావాన్ని పెంచడం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడం, స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం, పర్యావరణ సంరక్షణ, ఆరోగ్యంపై దృష్టి సారించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం. సేవే మన ధర్మం అనే నినాదంతో బీజేపీ దేశవ్యాప్తంగా ఈ ఉద్యమాన్ని తీసుకెళ్తోంది. తొలిసారి ప్రధానమంత్రిగా పోటీ చేసిన సమయంలో నేను మీ ప్రధాన సేవకుడిని అంటూ మోడీ చేసిన కామెంట్స్ ను పార్టీ నేతలు గుర్తు చేసుకుంటున్నారు.

**సేవా పక్వాడలో చేపట్టబోయే ప్రధాన కార్యక్రమాలు**

1. రక్తదాన శిబిరాలు: ప్రతి జిల్లా, మండల స్థాయిలో రక్తదానం శిబిరాలు నిర్వహించబడతాయి. పేదలకు, అవసరంలో ఉన్న రోగులకు ఇది ముఖ్య సహాయం కానుంది.
2. ఆరోగ్య శిబిరాలు: ఉచిత ఆరోగ్య తనిఖీలు, వైద్య సహాయం, మందులు అందించే శిబిరాలు ఏర్పాటు అవుతాయి. గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి
3. శుభ్రత కార్యక్రమాలు: స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో వీధులు, గ్రామాలు, పట్టణాలలో శుభ్రతా డ్రైవ్ లు నిర్వహిస్తారు.
4. యువత కోసం నమో యువ రన్ ఫిట్ నెస్, డ్రగ్ వ్యసనాల నుంచి దూరం, ఆరోగ్యకర జీవన విధానం కోసం బీజేపీ యువజన మోర్చా పలు నగరాలలో నమో యువ రన్ పేరుతో మారథాన్ ర్యాలీలు నిర్వహించనుంది.
5. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, దేశవ్యాప్తంగా చెట్లు నాటడం ప్రత్యేక కార్యక్రమంగా చేయనున్నారు.. అమ్మ పేరుతో ఒక మొక్క అంటూ మరోసారి ప్రచారం చేస్తున్నారు
6. ప్రదర్శనలు, పోటీలు: ప్రధాని మోడీ జీవితం, ఆయన ఆలోచనలను ప్రతిబింబించే ఫోటో ఎగ్జిబిషన్లు, చిత్రలేఖన, క్రీడా పోటీలు, వ్యాసరచన పోటీలు
7. స్వదేశీ ఉత్పత్తుల ప్రోత్సాహం: “వోకల్ ఫర్ లోకల్” నినాదంతో ఖాదీ, హస్తకళ ఉత్పత్తుల వినియోగాన్ని ప్రోత్సహించే ప్రచారాలు జరుగుతాయి.
8. ప్రభుత్వ పథకాల అవగాహన: పేదలు, బలహీన వర్గాల వారికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా ప్రత్యేక శిబిరాల ఏర్పాటు

---

# "శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయం" : ఒక విశ్లేషణాత్మక పరిశీలన



హైదరాబాద్ నగరం, తన గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వంతో, అనేక సంస్థలకు నిలయమై ఉంది. వాటిలో ఒకటి సుల్తాన్ బజార్‌లో ఉన్న" శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయం". ఈ సంస్థ తెలుగు భాషా సాహిత్యానికి, సంస్కృతికి సంబంధించిన ఒక ముఖ్యమైన మైలురాయి. 1901లో స్థాపించబడిన ఈ గ్రంథాలయం, తెలంగాణా ప్రాంతంలో మొదటి గ్రంథాలయంగా గుర్తింపు పొందింది. ఇది కేవలం పుస్తకాల సమాహారం మాత్రమే కాదు, తెలుగు భాషా పునరుజ్జీవనం మరియు ఆంధ్రోద్యమానికి ప్రతీక.

దీని చారిత్రక నేపథ్యాన్ని పరిశీలిస్తే, 19వ శతాబ్దం చివరి మరియు 20వ శతాబ్దం ప్రారంభంలో హైదరాబాద్ నిజాం రాజ్యంలో తెలుగు భాష,సంస్కృతులు ఒక రకంగా మరుగున పడిపోయాయి. రాజభాషగా "ఉర్దూ భాషా" ఆధిపత్యం కారణంగా తెలుగు ప్రజలలో భాషా చైతన్యం తగ్గిపోయింది. ఈ సమయంలో, బ్రిటిష్ సివిల్ సర్వెంట్ రాబర్ట్ సెవెల్ రచించిన "ఎ ఫర్‌గాటెన్ ఎంపైర్" అనే గ్రంథం తెలుగు వారిలో విజయనగర సామ్రాజ్యం, శ్రీ కృష్ణ దేవరాయల గొప్పతనం గురించి కొత్త ఆసక్తిని రేకెత్తించింది. ఈ ప్రభావంతో, కొమర్రాజు లక్ష్మణరావు వంటి మేధావులు భాషా నిలయం స్థాపనకు పూనుకున్నారు. 1901 సెప్టెంబర్ 1న, రామకోటి ప్రాంతంలోని రవిచెట్టు రంగారావు బంగళాలో ఈ సంస్థ ప్రారంభమైంది. దీనికి నాయని వెంకట రంగారావు ఆర్థిక సహాయం అందించారు. పాల్వంచ రాజా పార్థసారథి అప్పారావు సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఈ సంస్థ స్థాపన తెలంగాణాలో గ్రంథాలయోద్యమానికి మూలంగా నిలిచింది. "నిజాం రాజ్యంలో ఆంధ్రోద్యమం" ప్రారంభమైంది. తెలుగు భాషా, సంస్కృతుల పునరుజ్జీవనానికి ఇది కీలక పాత్ర పోషించింది. 1927లో సిల్వర్ జూబ్లీ జరిగింది, అప్పటికి బుర్గుల రామకృష్ణారావు కార్యదర్శిగా ఉన్నారు. అప్పటికే హైదరాబాద్‌లో 7, సికిందరాబాద్‌లో 4, వరంగల్‌లో 15, నల్గొండలో 13 గ్రంథాలయాలు స్థాపించారు. 1952లో గోల్డెన్ జూబ్లీలో శ్రీపాద కృష్ణ శాస్త్రి పాల్గొన్నారు. 2001లో సెంటనరీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాలు కేవలం జ్ఞాపకాలు మాత్రమే కాక, తెలుగు సాహిత్య చర్చలు, ఉపన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికలుగా మారాయి. విశ్లేషించి చూస్తే, ఈ సంస్థ నిజాం పాలనలో జాతీయవాద ఉద్యమానికి కూడా సహాయపడింది. సురవరం ప్రతాపరెడ్డి, మడపాటి హనుమంతరావు వంటి నాయకులు ఇక్కడ సమావేశాలు నిర్వహించారు.

ఈ భాషా నిలయంలో సుమారు 53,000 పుస్తకాలు, అనేక మ్యాగజైన్లు ఉన్నాయి. ఇవి తెలుగు, సంస్కృత భాషల్లో పురాణాలు, వేదాలు, మహాకావ్యాలు, నాటకాలు, నవలలు, సాహిత్య విమర్శలు, విజ్ఞాన గ్రంథాలు వంటివి. బ్రహ్మశ్రీ బంకుపల్లి మల్లయ్య శాస్త్రి సంపాదకత్వంలో సామవేదం, కృష్ణ యజుర్వేదం, రుగ్వేదం వంటి ప్రత్యేక సమాహారాలు ఉన్నాయి. అరుదైన శీర్షికలు ఎన్నో ఉన్నాయి, అందులో 1910 నుండి ఆంధ్ర పత్రిక ఉగాది సంచికలు, 1933 నుండి భారతి మ్యాగజైన్, కృష్ణ పత్రిక, సమదర్శిని, సుజాత, ప్రతిభ, తెలుగు స్వతంత్ర జయంతి, శారద, ఆంధ్ర పత్రిక, ఆంధ్ర ప్రభ, ఆంధ్ర జ్యోతి వంటి పత్రికలు ప్రముఖమైనవి. అలాగే, సుమారు 1,000 చేతి రాత ప్రతులు, అనేక పాత వార్తాపత్రికలు ఉన్నాయి. ఈ సమాహారాలు తెలుగు సాహిత్య ఔత్సాహికులకు ఒక గొప్ప తరగని నిధి. విశ్లేషణాత్మకంగా చూస్తే, ఈ సంఖ్యలు భాషా నిలయం యొక్క విస్తృతతను సూచిస్తాయి. డిజిటైజేషన్ ప్రక్రియలో ఇప్పటి వరకు కేవలం 10,000 పుస్తకాలు మాత్రమే డిజిటైజ్ అయ్యాయి, దీనికి నిధుల కొరత, సిబ్బంది లేమి, కాపీరైట్ సమస్యలు ప్రధాన కారణాలు. ప్రస్తుతం సుందరయ్య విజ్ఞాన కేంద్రం సహాయ, సహకారాలతో సంరక్షణ, ఆటోమేషన్, ఎలక్ట్రానిక్ క్యాటలాగింగ్ ప్రక్రియ జరుగుతోంది.

సాంస్కృతిక ప్రాముఖ్యత పరంగా, ఈ భాషా నిలయం తెలుగు భాషా దేవాలయంగా పరిగణించబడుతుంది. ఇక్కడ జరిగే సభలు, ఉపన్యాసాలు, జయంతి, వర్ధంతులు, సత్కార కార్యక్రమాలు తెలుగు సాహిత్యాన్ని ప్రోత్సహిస్తాయి. నన్నయ, తిక్కన, పోతన, వేమన వంటి కవుల జయంతులు, కందుకూరి, గురజాడ, గిడుగు, కొమర్రాజు వంటి ఆధునిక భాషా సంస్కర్తల ఉత్సవాలు ఇక్కడ జరుగుతాయి. ఇది హైదరాబాద్‌లోని సాహిత్య ప్రేమికులకు కేంద్ర బిందువు. విశ్లేషించి చూస్తే, ఈ సంస్థ తెలంగాణా గ్రంథాలయోద్యమానికి ఊతమిచ్చింది. రవీంద్ర భారతి, తెలంగాణా సారస్వత పరిషత్ వంటి సంస్థలతో సమానంగా ఇది సాంస్కృతిక ల్యాండ్‌మార్క్. నిజాం పాలనలో జాతీయవాదాన్ని ప్రోత్సహించింది. తెలుగు ప్రజలలో భాషా గౌరవాన్ని పెంచింది. ఇది కేవలం గ్రంథాలయం మాత్రమే కాదు, భాషా నిలయం అని పేరు పెట్టడం ద్వారా తెలుగు భాషా పునరుజ్జీవనానికి ప్రాధాన్యత ఇచ్చారు.

ఈ సెప్టెంబర్1న, 125వ,శతోపరి రజతోత్సవ వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ సాహిత్య సభలతో పాటు, "భాగ్యనగర భాషా నిలయం" అనే పేరుతో ఒక రూపకం కూడా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో డా.రియాజ్, అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్, డా.కే.వీ.రమణాచారి, ఐఏఎస్(రి), అధ్యక్షులు, శ్రీ కృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం,ప్రో.ఎస్.సుదర్శన్ రావు, విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, డాక్టర్ .రావి శారదా, ఎడిటర్, గ్రంథాలయ సర్వస్వం,అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రాధికారాణి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుతం నాలుగు అంతస్తుల కొత్త భవనం నిర్మాణం జరిగింది, ఇది రాష్ట్ర ప్రభుత్వం నిధులతో సాధ్యమైంది. ప్రస్తుత కమిటీలో డా. కె.వి. రమణాచారి (అధ్యక్షులు), టి. ఉదయవర్లు (కార్యదర్శి) వంటి వారు ఉన్నారు. అయితే, డిజిటైజేషన్ ఆలస్యం, నిధుల కొరత వంటి సవాళ్లు ఉన్నాయి. భవిష్యత్తులో, ఈ సమస్యలను పరిష్కరించి, ఆన్‌లైన్ యాక్సెస్‌ను పెంచితే, ఇది మరింత విస్తరణ పొందుతుంది.

చివరిగా, శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయం తెలుగు భాషా వారసత్వానికి ఒక సజీవ సాక్షి. దీని 53,000 పుస్తకాల సమాహారం, చారిత్రక పాత్ర, సాంస్కృతిక కార్యక్రమాలు దీనిని అనన్యసామాన్యమైనదిగా చేస్తాయి. ఈ డిజిటల్ యుగంలో కూడా, ఇది తెలుగు ప్రజలకు ప్రేరణగా నిలుస్తుంది. ఇటువంటి సంస్థలను సంరక్షించడం మనందరి బాధ్యత.

**డాక్టర్. కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**



# ప్రభుత్వ హాస్పిటల్ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలి

- సెప్టెంబర్ 24 నుండి నిరవధిక సమ్మెలోకి వెళ్తాం
- హాస్పిటల్ లో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి
- యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ డిమాండ్




**జర్నలిస్ట్ డైరీ, కరీంనగర్ ( సెప్టెంబర్ 15 ):**
కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యునియన కరీంనగర జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు 2 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వ హాస్పిటల్ నుండి కలెక్టరెట్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి, కలెక్టరెట్ వద్ద ధర్నా నిర్వహించిన అనంతరం కలెక్టర్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు బండారి శేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న సానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్ మరియు ప్లంబర్ కార్మికుల రెండు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, ప్రభుత్వ హాస్పిటల్లో కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలని, వారధి ద్వారా నేరుగా కలెక్టర్ చొరవ తీసుకొని జీవో నెం. 40 ప్రకారం రూ. 15,000 నుండి 22,000 వేల రూపాయలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, రాబోయో కొత్త టెండర్ లో యదావిధిగా కార్మికులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్పటల్ కార్మికులు దాదాపు 250 మంది పని చేస్తుంటే వీరికి గత రెండు నెలలుగా జీతాలు రావడం లేదని పెండింగ్లో ఉన్న జీతాలు ఇవ్వాలని ప్రతి రెండు నెలకొకసారి ఏదో ఒక రూపంలో ఆందోళనలు, వినతిపత్రాలు, నిరవధిక సమ్మెలు చేయవలసి వస్తున్నది. ఇది కేవలం ఏజిల్ కాంట్రాక్టు యాజమాన్యం కార్మికుల పట్ల నిర్లక్ష్యంతోనే
ప్రతిసారి ఆందోళనలు చేయాల్సి వస్తుందన్నారు. జీతాలు ఇవ్వమని అడిగితే ప్రభుత్వం నుండి బడ్జెట్ రావడం లేదని చెప్పడం సిగ్గు చెటని విమర్శించారు. గత మూడు సంవత్సరాలుగా కార్మికుడికి రూ.11,000 ఇస్తున్నారని, ఒకవేళ కార్మికుడు ఒక రోజు పనికి రాకుంటే రోజుకు రూ.500/ లు కొత్త పెట్టడం ఎక్కడి అన్యాయమని ప్రశ్నించారు. పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేస్తలేరని విమర్శించారు. టెండర్ కాల వ్యవధి అయిపోతున్నందున, రెన్యూవల్ చేయవద్దని, కార్మికులకు కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ప్రకారం జీవో నెం. 40 ప్రకారం జీతాలు రూ.15,000 లకు పైగా ఇవ్వగలన్నారు. ప్రభుత్వ హాస్పిటల్లో టెండర్ (కాంట్రాక్టు) వ్యవస్థను రద్దుచేసి నేరుగా వారిధి ద్వారా కార్మికులకు జీతాలు చెల్లించే విధంగా కలెక్టర చొరవ తీసుకోవాలని కోరారు. నూతన కాంట్రాక్టు వ్యవస్థ వస్తే ఇప్పుడునటువంటి కార్మికులను యదావిధిగా కొనసాగించాలన్నారు. ఇప్పుడు పనిచేస్తున్న కార్మికులు దాదాపు 30 సంవత్సరాల నుండి పనిచేస్తున్న వాళ్ళు కాబట్టి ఏ ఒక్కరిని కూడా తొలగించవద్దని హెచ్చరించరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్స్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు పి. అరుణ్, ప్రధాన కార్యదర్శి పి. కళావతి, రాజు,రేక,శంకర్, శారదా, రాకేష్, వందమంది కార్మికులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 15 ) :**
శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకొనగా ఇద్దరు లబ్ధిదారులకు (CMRF) ద్వారా మంజూరైన రూ.1,48,000/ ఒక లక్ష నలభై ఎనిమిది వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబంధించిన CMRF చెక్కులను బాధిత కుటుంబాలకి అందజేశారు పీఏసీ చైర్మన్ గాంధీ.
ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారు పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్థోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని ఈ సందర్భంగా తెలియచేశారు.
పేద మధ్యతరగతి ప్రజలకు ఆసుపత్రిలో బిల్లులు కట్టలేని పరిస్థితిలో ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తూ ఆర్థిక సాయంని అందిస్తుందని దీనిలో భాగంగానే నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్నో వందలాది కుటుంబాలను CMRF ద్వారా ఆదుకున్నామని తెలిపారు.
గతంలో ఉన్న బిల్లులకు అనుగుణంగానే ప్రస్తుతం ఆర్థిక సాయం అందిస్తుందని దానిని మరింత పెంచేలా కృషి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే కలిసి వినతి పత్రాన్ని అందజేస్తానని , మరింత ఆర్థిక సహాయం పెంచితే పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుంది అని అన్నారు.

**CMRF వివరాలు**
1.మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ కి చెందిన శ్రీమతి సబిత గారికి వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి CMRF ద్వారా మంజూరైన 1,20,000/ ఒక లక్ష ఇరవై వేల రూపాయలుగా మంజూరి అయినవి అని తెలియ చేసారు.
2.వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని రామ కృష్ణ నగర్ కాలనీ కి చెందిన శ్రీ మాచర్ల భద్రయ్య కి వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి CMRF ద్వారా మంజూరైన 28,000/ ఇరవై ఎనిమిది వేల రూపాయలుగా మంజూరి అయినవి అని తెలియచేసారు.
ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధితుల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.








# ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 15) :**
మియాపూర్ డివిజన్ పరిధిలోని నడిగడ్డ తాండా లో నెలకొన్న పలు సమస్యల పై స్వామి నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగారెడ్డి జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ వారు నిర్వహించిన సమావేశం లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి , జాతీయ ఎస్టీ కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి , అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి, కస్టోడియన్ ఎనిమి ప్రాపర్టీ డిప్యూటీ సెక్రటరీ ముంబాయి సెక్రెటరీ శ్రీ అశోక్ కుమార్ గారు, CRPF సెకండ్ కమాండెంట్ అమిత్ మిశ్రా మాజీ ఎంపీ రవీంద్ర నాయక్, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రామేశ్వరి దేవి, RDO వెంకట్ రెడ్డి, తహసీల్దార్ వెంకారెడ్డి, డీసీ శ్రీమతి శశిరేఖ, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి పాల్గొన్నారు పీఏసీ చైర్మన్ ఆర్కెపూడి గాంధీ.

ఈ సందర్భంగా నడిగడ్డ తాండా లో పర్యటించి స్థానికులకు అక్కడా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పీఏసీ చైర్మన్ గాంధీ గారు మాట్లాడుతూ...నడిగడ్డ తాండా, సుభాష్ చంద్ర బోస్ నగర్, ఓంకార్ నగర్ కాలనీలలో నెలకొన్న సమస్యలు త్వరలోనే పరిష్కరానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. నడిగడ్డ తండా ,సుభాష్ చంద్రబోస్ నగర్, ఓ కార్ నగర్ లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించామని, రోడ్లు డ్రైనేజి, మంచి నీటి సరఫరా, బస్తి దవాఖాన, విధి దీపాలు మొదలు మౌలిక వసతులు కల్పించామని,అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడలేదు అని అన్ని విధాలుగా అండగా ఉన్నాం అని తెలియచేసారు. గతంలో సమస్య పరిష్కారానికి CRPF IG ని పలు మార్లు కలిశాం అని , నడిగడ్డ తండా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దు అని తెలియచేసమనీ తెలియచేసారు.

వారం రోజులలో సమగ్ర నివేదిక అందిన వెంటనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం అని , సమస్యల పరిష్కారంతో పాటు రక్షణ కల్పిస్తామని , తండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి రక్షణ కల్పించేలా చర్యలు తీసుకుంటామని మీకు అన్ని విధాలుగా అండగా ఉంటామని తండా అభివృద్ధి బాధ్యత నాది అని తెలియచేసారు.
తాండ ప్రజలకు crpf సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు కలగజేయారాదని అన్నారు. ప్రజలను కాపాడుకుంటూనే స్థలాన్ని కాపాడాలని అన్నారు CRPF సిబ్బంది తాండ ఇండ్ల ముందుకు, ఇండ్లలోకి వెళ్లి ఇబ్బందులు కలిగించారాదని చైర్మన్ గాంధీ తెలిపారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశ పెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అందరికి ఇండ్లు నిర్మించుకునేవిధంగా సహాయ సహకారాలు అందిస్తామని తెలియచేసారు, నడిగడ్డ తండా లో హాస్పిటల్, స్మశాన వాటిక ను నిర్మిస్తామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల ను , డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ,ప్రజలకు మరింత మౌలిక వసతులు కల్పించి మెరుగైన జీవన ప్రమాణాలు పెంపొందించెల అన్ని రకాల చర్యలు తీసుకుంటామని తెలియచేసారు.
ఈ కార్యక్రమంలో GHMC అధికారులు, ఎలక్ట్రికల్ , పారిశుధ్య విభాగం మరియు ప్రజలు తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ ఆకాంక్షల సాధనకు ఉద్యమకారులుగా నిరంతరం పోరాడుతాం

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్ (సెప్టెంబర్ 15 ) :**
నాడు సీమాంధ్ర దోపిడీ పాలనకు వ్యతిరేకంగా వివిధ రంగాల్లో వివిధ రూపాల్లో పోరాటం చేసినటువంటి ఉద్యమకారులంతా సంఘటితంగా తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కొరకు పోరాడుతామని తెలంగాణ జన సమితి అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. ఈరోజు తెలంగాణ జన సమితి కార్యాలయంలో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాడు తెలంగాణ రాష్ట్రం కొరకు వివిధ జేఏసీలుగా, సంఘాలుగా ఏర్పడి సంఘటితమై తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని అదే స్ఫూర్తి తో ఉద్యమ ఆకాంక్షల సాధన కొరకు, ఉద్యమకారుల సంక్షేమం కొరకు అందరం సమిష్టిగా కలిసికట్టుగా నిలబడదామని ఆయన పిలుపునిచ్చారు. విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఎన్నో త్యాగాలతో కూడుకున్నదని ఉద్యమకారులు ఎంతో నిజాయితీగా పోరాడి సాధించుకున్నారని, ఆకాంక్షల భిన్నంగా గత పది సంవత్సరాల పాలన సాగిందని, ఇప్పటికైనా ఈ ప్రభుత్వమైనా ప్రజాస్వామికంగా పాలన కొనసాగించి ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఉద్యమ సంఘాల జేఏసీలు, ఉద్యమకారుల సంక్షేమ సంఘాలు, 69 ఉద్యమకారుల ఫోరం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. అనంతరం సమావేశం మూడు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది.




**తీర్మానాలు:**
1. సీమాంధ్ర వలస పాలనకు, దోపిడికి వ్యతిరేకంగా దశాబ్దాల పాటు ఎన్నో పోరాటాలతో, త్యాగాలతో, ఆత్మ బలిదానాలతో సాధించుకున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం. ఇది ఏ ఒక్కరో సాధించిన విజయం కాదు. ప్రజలందరూ సమిష్టిగా సకలజనులమేకమై సాధించిన ఈ రాష్ట్రం ఏ ఒక్కరి ప్రయోజనాల కోసమే కాకుండా ఉద్యమ ఆకాంక్షలతో కూడిన రాష్ట్రంగా నిర్మాణం జరగాలని ఆ వైపుగా తెలంగాణ ఉద్యమకారులంతా కలిసికట్టుగా పనిచేస్తాం.
2. తెలంగాణ రాష్ట్ర సాధన ఎన్నో త్యాగాలతో కష్టనష్టాలను ఎదుర్కొని ఉద్యమకారులందరూ కలిసి సాధించినటువంటిది. స్వరాష్ట్రంలో గత పది సంవత్సరాల కాలంలో తొలి తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారులకు కనీస గౌరవం ఇవ్వ. ఉద్యమకారుల సంక్షేమం గూర్చి పట్టించుకోలేదు. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు సమోన్నత గౌరవం కల్పిస్తామని ఉద్యమకారుల సంక్షేమానికి పూనుకుంటామని, ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని, అమరవీరుల కుటుంబాలకు పెన్షన్ ఇస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియకు పూనుకొని ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతున్నాం
3. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షల సాధన కొరకు తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కొరకు ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో సమన్వయంతో కలిసి పని చేస్తాం.
తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నరసయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సమావేశంలో సిపిఐ.ఎం.ఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే గోవర్ధన్, అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ రాజేందర్ రెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, ఉద్యోగ జేఏసీ నాయకులు ఎం.బి కృష్ణ యాదవ్, తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ ప్రఫుల్ రామ్ రెడ్డి, వివిధ ఉద్యమకారుల సంఘాల నేతలు తెలంగాణ వెంకన్న, రమాదేవి, రామగిరి ప్రకాష్, శ్యాంసుందర్ గౌడ్, అంజిరెడ్డి, కుమారస్వామి, రామ్మూర్తి,గొల్లపల్లి నాగరాజు, ఆర్టీసీ జేఏసీ లాలయ్య, మల్లయ్య, 1969 ఉద్యమకారులు తిప్పన సిద్దులు, నలమాస స్వామి, రాజేంద్ర బాబు. తెలంగాణ జన సమితి ఉపాధ్యక్షులు అంబటి శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శులు దర్మార్జున్, పల్లె వినయ్, పార్టీ నాయకులు ఆర్ లక్ష్మి, తుల్జారెడ్డి ఆశప్ప, నిజ్జన రమేష్, హనుమంత్ రెడ్డి, సలీమ్ పాషా, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళ అదృశ్యం

- ఆందోళనలో కుటుంబ సభ్యులు



**జర్నలిస్ట్ డైరీ, చైతన్యపురి(సెప్టెంబర్ 15):**
దిల్‌సుఖ్‌నగర్‌లోని ఎంసీహెచ్ కాలనీకి చెందిన సుమయా బేగం (20) అదృశ్యమైన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సుమయా భర్త ఎస్‌కే ఆరిఫ్ (22) ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశఆరు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం ఉదయం 9:30 గంటలకు ఆమె ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపాడు. ఆరిఫ్ పని కోసం బయటకు వెళ్లిన సమయంలో ఈ ఘటన జరిగింది. తల్లి ఫోన్ ద్వారా సమాచారం అందిన వెంటనే, ఆరిఫ్ బంధువులు, అన్ని చోట్లా వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో ఆరిఫ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. చైతన్యపురి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. ఆచూకీ ఎవరికైనా తెలిస్తే, చైతన్యపురి పోలీసులకు సమాచారం అందించాలని పత్రికా ప్రకటనలో తెలిపారు. చైతన్యపురి పోలీస్ స్టేషన్ 8712662358, సీఐ 8712662305, సబ్‌ఇన్‌స్పెక్టర్ 8712578827, 8712662326 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.




# యాత్ర దానం' పోస్టర్ ను ఆవిష్కరించిన పీఏసీ ఛైర్మన్

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 15) :**
TGSRTC సామజిక బాధ్యతలో భాగంగా వినూత్న సేవ కార్యక్రమం 'యాత్ర దానం' పోస్టర్ ను మియాపూర్1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీమతి అశ్విని దేవి గార్ల తో కలిసి పోస్టర్ ను ఆవిష్కరించారు చైర్మన్ గాంధీ.

ఈ సందర్భంగా పీఏసీ చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. వ్యక్తుల పుట్టినరోజు, వివాహ వార్షికోత్సవాలు,పండుగలు,ఇతర శుభదినాలు వంటి ఆనందకర సందర్భములలో ఆనాధలు, నిరాశ్రయులు, వృద్దులు,దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలు, విహార యాత్రలకు తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం అని తెలియచేసారు.
ఈ మహోన్నత సేవ లో భాగస్వాములవదలచినవారు వారి యొక్క సంతోషకరమైన రోజులో ఈ కార్యక్రమం ద్వారా ఇతరుల చిరునవ్వుల్లో ఆనందాన్ని పొందవచ్చు తాము కోరుకునే శుభదినాన టిఎస్ఆర్టిసి కి విరాళం అందజేసి ఆ విరాళం ఆధారంగా ఏసీ,సూపర్ లగ్జరీ బస్సు ధ్వారా విహారయాత్రలు ఏర్పాటు చేయించుకోవచ్చని తెలిపారు తాము జరుపుకునే శుభదినాన తగిన మొత్తాన్ని సంస్థకు విరాళంగా అందజేయడం ద్వారా ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పిస్తుందని యాత్రదానం కార్యక్రమం నిర్వహణ కోసం ప్రత్యేక నిధి సంస్థ ఏర్పాటు చేసిందన్నారు.
వ్యక్తులతోపాటు ప్రజాప్రతినిధులు కార్పొరేట్ సంస్థలు ఎన్ఆర్ఐ , అసోసియేషన్లు ఎన్జీవోలు స్పాన్సర్ చేసి ఆనాధలు, నిరాశ్రయులు వృద్దులు,దివ్యంగులు, విద్యార్థులు, ప్రసిద్ధ దేవాలయాలకు, పర్యాటక ప్రాంతాలకు , విహారయాత్రలకు తీసుకెళ్ళచ్చని తెలిపారు.
ఈ యాత్ర దినమును వ్యక్తులు కుటుంబసభ్యులు , బంధువులు , స్నేహితులు ,కూడా వినియోగించుకోవచ్చని యాత్రదాన కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేసేందుకు రాష్ట్రం లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలు, పర్యాటక సంస్థలను కవర్ చేస్తూ ప్రత్యేక టూర్ ప్యాకేజీలను సంస్థ రూపొందించారు.
దాతలు చెల్లించే విరాళం మేరకు కిలోమీటర్ల ఆధారంగా ఏసి , సూపర్ లీగ్జరి , బస్సులను విహారయాత్రలకు సంస్థ ఏర్పాటు చేస్తుందని , టూర్ ప్రారంభానికి వారం రోజుల ముందు బస్సులను బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. డిపో మనగర్లను (miyapur1, miyapur2)అధికారులను సంప్రదించి యాత్రదానం కింద బస్సులను book చేసుకోవచ్చని అదేవిధంగా హెల్ప్లైన్ నంబర్లు : 9959226153 , 7659029882 మరియు టోల్ ఫ్రీ నెంబర్ : 04069440000 , 040 23450033 లకు కాల్ చేసి సమాచారం ఇచ్చినట్లైతే , సంబంధిత అధికారులు తిరిగి సంప్రదించి పూర్తి వివరాలను తెలియజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఆనాధలు ,నిరాశ్రయులు ,దివ్యంగులు ,నిరుపేద విద్యార్థులకు జీవితంలో మరపురాని అనుభూతిని కలిగించవచ్చని తెలిపారు.



# అంగనివాడి టీచర్ల రిటేర్మెంట్ బెన్ పీట్స్ ఎప్పుడు ఇస్తారు

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (సెప్టెంబర్ 15) :**
రిటైర్మెంట్ అయినా అంగన్వాడీ టీచర్లకు ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఎందుకు ఇవ్వరు అధికారులు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ స్థానిక సిడిపిఓ గారికి వినతి పత్రాన్ని ఇచ్చారు ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు టంగుటూరి నరసింహారెడ్డి బి కే ఎం యు జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధుల జంగయ్య మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు ఆయాలు రిటైర్మెంట్ అయి 14 నెలలవుతున్న వారికి టీచర్ల కురెండు లక్షల ఆయాకులక్ష ఇస్తామన్న ప్రభుత్వం నేటికీ ఇవ్వలేకపోయిందని వారు ఏమి తిరిగి బతకాలో ప్రభుత్వమే సమాధానం చెప్పాలన్నారు చాలామంది అంగన్వాడీ టీచర్లు ఆయాలు రిటైర్మెంట్ అయిన తర్వాత చనిపోయిన పరిస్థితి ఉంది, వృద్ధాప్యంలో వారికి ఆసరాగా ఉంటుందని ఆసరా పెన్షన్ అప్లై చేసుకోవడానికి కూడా రిటైర్మెంట్ సర్టిఫికెట్ కూడా ఇవ్వలేకపోయారు ఇన్ని రోజులు వారితో చాకిరి చేయించుకున్న ప్రభుత్వం వారి సమస్య గురించి పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు వెంటనే వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ తో పాటు రిటైర్మెంట్ సర్టిఫికెట్ కూడా ఇచ్చి ఆసరా పెన్షన్ కు ప్రభుత్వం అధికారులు సహకరించాలని ఒక నెల వేతనం కూడా వారికి బకాయున్నది కాబట్టి ఆ నెల వేతనాన్ని కూడా వాళ్ళ అకౌంట్లో వేసి వాళ్ళను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని గుర్తు చేశారు వారి సమస్య పరిష్కరించని ఎడల ఏఐటీయూసీ అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మిగతా కలిసి వచ్చే యూనియన్లను కూడా కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలని నిర్వహించాల్సి ఉంటుందని వారు సిడిపిఓ కి తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు రామచంద్రమ్మ యాదమ్మ విమలమ్మ రామ చంద్రమ్మ బుజ్జినో బి కె ఎం యు నాయకులు రమేష్ యాదవ్ కే రాజు శంకర్ తదితరులు పాల్గొన్నారు వారు ఏం తిని బ్రతకాలో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని ఆవేదన వ్యక్తం చేశారు

### యూరియాపై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన..

# అలా చేస్తేనే రైతులకు లాభాలు!

- యూరియా వాడకం తగ్గించడంపై సీఎం చంద్రబాబు కీలక ప్రకటన..
- రైతులు వచ్చే ఏడాది నుంచి యూరియా వాడకాన్ని తగ్గిస్తే, ఆ మేరకు ప్రోత్సాహం..
- ప్రస్తుతం వాడుతున్న యూరియాను తగ్గిస్తే, ప్రతి కట్టకు రూ. 800 రైతులకు ఇస్తాం..
- కొన్ని యూరప్ దేశాలు కూడా మన ఉత్పత్తుల ధరలను తగ్గిస్తున్నాయి: సీఎం చంద్రబాబు




**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఏపీ సచివాలయంలో కొనసాగుతున్న కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో వ్యవసాయంపై సీఎం చంద్రబాబు కీలక వ్యాఖ్యలు చేశారు. యూరియా వాడితే అధిక దిగుబడి వస్తుందనడం కరెక్ట్ కాదు అన్నారు. దీనికి పంజాబ్‌ను కేసు స్టడీగా తీసుకోవాలి అని సూచించారు. యూరియాను అవసరం మేరకే వాడాలని తెలిపారు. అయితే, రైతులు వచ్చే ఏడాది నుంచి యూరియా వాడకాన్ని తగ్గిస్తే, ఆ మేరకు ప్రోత్సాహం ఇస్తామని చెప్పుకొచ్చారు. కాగా, ప్రస్తుతం వాడుతున్న యూరియాను తగ్గించే ప్రతి కట్టకు రూ. 800 నేరుగా రైతులకు అందజేస్తామని వెల్లడించారు. మన రైతులు ఎక్కువ ఎరువులు వాడుతున్నారు, దాని వల్ల మిరప పంటను చైనా తిప్పి పంపించిందన్నారు. అలాగే, కొన్ని యూరప్ దేశాలు కూడా మన ఉత్పత్తులపై ధరలను తగ్గిస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలియజేశారు. అయితే, ప్రజారోగ్యం దృష్ట్యా పంటల్లో యూరియా వినియోగం తగ్గిస్తే మంచిదని చంద్రబాబు అన్నారు. యూరియా వినియోగం తగ్గించే రైతులకు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. ఇప్పటికే, ఏపీ క్యాన్సర్‌లో టాప్ 5 స్థానంలో ఉంది.. ఇలాగే, కొనసాగితే క్యాన్సర్‌లో ప్రథమస్థానంలోకి వెళ్తామన్నారు. త్వరలోనే దానికి సంబంధించిన విధి విధానాలను ప్రకటిస్తామన్నారు. పీఎం ప్రణామ్ కింద రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చే సబ్సిడీని రైతులకే ఇచ్చేద్దాం.. ఇక, యూరియా కొరత లేదు.. అవసరమైతే డోర్ డెలివరీ చేద్దామన్నారు. నియోజకవర్గానికో యానిమల్ హాస్టల్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. అర్బన్ నియోజకవర్గాలను మినహాయించి 157 నియోజకవర్గాల్లో యానిమల్ హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలి అన్నారు. అలాగే, గోశాలల నిర్మాణం వల్ల పశు సంపద రాష్ట్రానికి రిటన్ గిఫ్ట్ ఇస్తోంది.. జీఎస్డీపీ వృద్ధిలో లైవ్ స్టాక్ పాత్ర కీలకం కానుంది. పాడి పరిశ్రమ అనేది చక్కటి ఆదాయ మార్గంగా ఉంటుంది అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు.



## తాడిపత్రిలో పోలీస్ భద్రతకు అయ్యే ఖర్చు చెల్లింపుపై వివాదం.. జేసీ సీరియస్!

- తాడిపత్రిలో పోలీసు భద్రతకు అయ్యే ఖర్చు చెల్లింపుపై వివాదం..
- పెద్దారెడ్డి నుంచి పోలీసులు చలనా రూపంలో ఎలాంటి డబ్బులు కట్టించుకోలే..
- డబ్బులు కట్టకపోతే కేతిరెడ్డికి బందోబస్తు కల్పించొద్దని జేసీ ప్రభాకర్ రెడ్డి సూచన..

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

అనంతపురం జిల్లా తాడిపత్రిలో పోలీసు భద్రతకు అయ్యే ఖర్చు చెల్లింపు వివాదం చెలరేగుతుంది. పోలీస్ భద్రతకు అయ్యే ఖర్చు పెద్దారెడ్డి నుంచి ఎందుకు వసూలు చేయడం లేదని తాడిపత్రి పట్టణ పోలీసులకు జేసీ ప్రభాకర్ రెడ్డి లేఖ రాశారు. పోలీసులు కేతిరెడ్డి పెద్దారెడ్డి నుంచి చలనా రూపంలో ఎటువంటి డబ్బులు కట్టించుకోలేదన్నారు. ఇంకా, పోలీసులు మాత్రం ముఖ్యమంత్రి స్థాయిలో బందోబస్తును కేతిరెడ్డికి కల్పిస్తూ.. అనవసరంగా ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని జేసీ ఆరోపించారు. కాగా, పెద్దారెడ్డికి బందోబస్తు కావాలని కోరుకుంటే ఆయనకి బందోబస్తుకు తగిన నగదు కట్టించుకొని బందోబస్తు ఇవ్వండి లేకుంటే బందోబస్తు ఇవ్వాల్సిన అవసరం లేదంటూ జేసీ ప్రభాకర్ రెడ్డి ఆ లేఖలో రాసుకొచ్చారు.
ఇక, డబ్బులు కట్టించుకోకుండా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి బందోబస్తు కల్పిస్తే పోలీసుల మీద న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాను అని జెడ్పీ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. మరోవైపు నగదు చెల్లింపు జరిగిందా లేదా అంటూ వివరాలు ఇవ్వాలనీ ఆర్టీఏ యాక్ట్ కింద న్యాయవాది అనీఫ్ భాష దరఖాస్తు చేశారు. తాడిపత్రికి వెళ్లే సమయంలో సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం భద్రత కల్పించాలని గతంలో పోలీసులను కోరిన కేతిరెడ్డి పెద్దారెడ్డి.. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు పోలీసు భద్రతకు అయ్యే ఖర్చు వివరాలు ఇస్తాం.. డిపాజిట్ చేయాలని పోలీసులు తెలిపారు. దానికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి అంగీకరించారు.



## మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలను కొనియాడిన జగన్

- ఇంజనీర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన జగన్
- మోక్షగుండం విశ్వేశ్వరయ్య సేవలు చిరస్మరణీయమని ట్వీట్
- దేశం గర్వించదగ్గ నిపుణుడు అని కొనియాడిన జగన్

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇంజినీర్లకు 'ఇంజినీర్స్ డే' శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు ఆయన తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ఒక సందేశాన్ని పోస్ట్ చేశారు.
భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకుని ఆయన సేవలను జగన్ స్మరించుకున్నారు. "దేశం గర్వించదగ్గ ఇంజినీరింగ్ నిపుణులు, ఎన్నో తాగు, సాగునీటి ప్రాజెక్టుల రూపశిల్పి భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారు. దేశానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. విశ్వేశ్వరయ్య గారి జయంతి సందర్భంగా ఇంజనీర్లందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు" అని తన పోస్టులో పేర్కొన్నారు.
భారతదేశపు గొప్ప ఇంజినీరింగ్ మేధావిగా పేరుగాంచిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య పుట్టినరోజైన సెప్టెంబర్ 15వ తేదీని ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా 'ఇంజనీర్స్ డే'గా జరుపుకోవడం ఆనవాయతీగా వస్తోంది. ఈ సందర్భంగా దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్రను పలువురు గుర్తుచేసుకుంటున్నారు.

## చరిత్ర చెరిపేస్తే చెరగదు: విడదల రజని



- ఐదు మెడికల్ కాలేజీలపై మాజీ మంత్రి విడదల రజని ట్వీట్
- రెండు సంవత్సరాల క్రితం కాలేజీలు ప్రారంభమయ్యాయని వెల్లడి
- ఇది జగన్ తీసుకున్న చారిత్రక నిర్ణయమన్న మాజీ మంత్రి

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

వైసీపీ హయాంలో రాష్ట్రంలో ప్రారంభించిన ఐదు ప్రభుత్వ మెడికల్ కాలేజీల అంశంపై మాజీ మంత్రి విడదల రజని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "చరిత్ర చెరిపేస్తే చెరగదు" అంటూ ఆమె ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న కీలక నిర్ణయాలను, సాధించిన ప్రగతిని ప్రజల ముందు ఉంచే ప్రయత్నం చేశారు.
సరిగ్గా రెండేళ్ల క్రితం, అంటే 2023 సెప్టెంబర్ 15న, వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒకేసారి ఐదు ప్రభుత్వ వైద్య కళాశాలలను చారిత్రాత్మక రీతిలో ప్రారంభించుకున్నామని తెలిపారు. విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల పట్టణాల్లో ఈ కళాశాలలు ప్రారంభమైనట్లు తన పోస్టులో పేర్కొన్నారు.
ఈ మెడికల్ కాలేజీల ఏర్పాటును కేవలం విద్యా సంస్థల ప్రారంభోత్సవంగా చూడకూడదని విడదల రజని అభిప్రాయపడ్డారు. "ఇవి కేవలం కాలేజీలు కావు.... రాష్ట్ర ప్రజల ఆరోగ్య భవిష్యత్తు కోసం వైఎస్ జగన్ తీసుకున్న చారిత్రక నిర్ణయం.. ఇది వైసీపీ ముద్ర" అని ఆమె తన పోస్టులో స్పష్టం చేశారు. ఈ కళాశాలల ఏర్పాటు వెనుక జగన్ దార్శనికత ఉందని ఆమె కొనియాడారు.



## ఎన్నికల సంఘం ప్రధాని మోదీ చేతిలో బందీ అయింది: షర్మిల

- ఎన్నికల సంఘం ప్రధాని మోదీ నియంత్రణలో పనిచేస్తోందన్న వైఎస్ షర్మిల
- ఈసీ పూర్తిగా బీజేపీ ఎన్నికల ఏజెంట్‌గా మారిపోయిందని తీవ్ర ఆరోపణ
- కర్ణాటక, మహారాష్ట్రలలో జరిగిన ఓట్ల అవకతవకలను ప్రస్తావించిన షర్మిల
- దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ పోరాటం
- రాష్ట్రంలో నేటి నుంచి అక్టోబర్ 15 వరకు సంతకాల సేకరణ కార్యక్రమం

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) పనితీరుపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సంచలన ఆరోపణలు చేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడాల్సిన ఎన్నికల సంఘమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతిలో బందీగా మారిందని, బీజేపీకి ఎన్నికల ఏజెంట్‌గా పనిచేస్తోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలంతా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.
ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన ఈసీ, పూర్తిగా బీజేపీ ప్రయోజనాల కోసం పనిచేస్తోందని షర్మిల ఆరోపించారు. కేవలం ఎన్నికల సంఘమే కాకుండా సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలన్నీ ప్రధాని మోదీ గుప్పిట్లో ఉన్నాయని, ఆయన ఆదేశాల మేరకే పనిచేస్తున్నాయని విమర్శించారు. ఈ వాస్తవాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశ ప్రజల ముందు ఉంచారని, ఇది నేటి భారత ప్రజాస్వామ్య దుస్థితికి నిదర్శనమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.
తన ఆరోపణలకు బలం చేకూరుస్తూ, దేశంలో జరుగుతున్న ఓట్ల అవకతవకలకు సంబంధించి కొన్ని ఉదాహరణలను ఆమె ప్రస్తావించారు. కర్ణాటకలోని మహాదేవపుర నియోజకవర్గంలో ఏకంగా లక్ష దొంగ ఓట్లను నమోదు చేశారని, అవన్నీ నకిలీ ఫోటోలు, పేర్లు, చిరునామాలతో సృష్టించినవేనని ఆమె ఆరోపించారు. అదేవిధంగా, మహారాష్ట్ర ఎన్నికల సమయంలో పోలింగ్ చివరి గంటలో, అంటే సాయంత్రం 5 నుంచి 6 గంటల మధ్య, అనూహ్యంగా 60 లక్షలకు పైగా ఓట్లు పోల్ అయ్యాయని, ఆ ఓట్లు ఎవరు వేశారో చెప్పడానికి ఈసీ వద్ద ఎలాంటి ఆధారాలు, సీసీటీవీ ఫుటేజ్ లేదని ఆమె దుయ్యబట్టారు. ఎన్నికలకు కేవలం ఐదు నెలల ముందు కోటికి పైగా కొత్త ఓట్లు నమోదు కావడం వెనుక పెద్ద కుట్ర ఉందని షర్మిల అనుమానం వ్యక్తం చేశారు.
బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తూ, వారికి అనుకూలంగా దొంగ ఓట్లను చేర్చడం ద్వారా ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. ఈ ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పోరాటానికి సిద్ధమైందని తెలిపారు. ఈ పోరాటంలో భాగంగా, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా సంతకాల సేకరణ ఉద్యమాన్ని చేపడుతున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలందరూ ఇందులో పాల్గొని తమ మద్దతు తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ఈ విజయం బాధ్యత, సేవతో కూడిన ఉపాధ్యాయ వృత్తికి ఆరంభం: మంత్రి నారా లోకేశ్

- మెగా డీఎస్సీ-2025 తుది ఎంపిక జాబితా విడుదల
- ఎక్స్ ఖాతా ద్వారా ప్రకటించిన మంత్రి నారా లోకేశ్
- 150 రోజుల రికార్డు సమయంలో నియామక ప్రక్రియ పూర్తి
- ఇచ్చిన మాట ప్రకారం ఇకపై ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ
- సీఎం చంద్రబాబు తొలి సంతకంతో నెరవేరిన హామీ
- అధికారిక వెబ్ సైట్ లో అందుబాటులో ఉన్న ఫలితాలు



**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్‌లోని ఉపాధ్యాయ అభ్యర్థుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా డీఎస్సీ 2025 తుది ఎంపిక జాబితాను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఈ విషయాన్ని ఆయన తన అధికారిక 'ఎక్స్' ఖాతా ద్వారా వెల్లడించారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ, రికార్డు స్థాయిలో కేవలం 150 రోజుల్లోనే ఈ నియామక ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేశామని ఆయన తెలిపారు.
ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు స్వీకరించిన వెంటనే మెగా డీఎస్సీ ఫైల్‌పైనే తొలి సంతకం చేసిన విషయాన్ని మంత్రి లోకేశ్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ హామీని నిలబెట్టుకుంటూ, పారదర్శకంగా నియామక ప్రక్రియను ముగించినట్లు పేర్కొన్నారు. తుది జాబితా సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి అధికారిక వెబ్ సైట్ www.apdsc.apcfss.in లో అభ్యర్థులకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు.
ఎంపికైన అభ్యర్థులకు మంత్రి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. "ఈ విజయం బాధ్యత, సేవతో కూడిన ఉపాధ్యాయ వృత్తికి ఆరంభం. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతూ, విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు. కొత్తగా విధుల్లో చేరనున్న ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేయాలని సీనియర్ ఉపాధ్యాయులను కోరారు.
ఈసారి అవకాశం దక్కించుకోలేని అభ్యర్థులు నిరుత్సాహపడొద్దని లోకేశ్ భరోసా ఇచ్చారు. "ఇచ్చిన హామీ ప్రకారం, ఇకపై ప్రతీ ఏటా డీఎస్సీ నిర్వహించడం జరుగుతుంది. పట్టుదలతో సాధన కొనసాగించండి, అవకాశం తప్పకుండా వస్తుంది" అని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ మాట నిలబెట్టుకుంటూ ఇంత త్వరగా నియామక ప్రక్రియ పూర్తి చేయడంపై నిరుద్యోగ యువత హర్షం వ్యక్తం చేస్తోంది.


## మాజీ సీఎం జగన్‌పై టీడీపీ ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు..

**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

మెడికల్ కాలేజీల వివాదంపై టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఘాటుగా విమర్శలు చేశారు. మాజీ సీఎం జగన్ అన్నట్లుగా రాజమండ్రి మెడికల్ కాలేజీ చూసి ఆహా అనలేమని.. రాజమండ్రిలో ఓహో అనిపించేలా వైసీపీ పార్టీ కార్యాలయం మాత్రం కట్టుకున్నారని ఆరోపించారు. గత జగన్ ప్రభుత్వం మెడికల్ కాలేజ్ నిర్మిస్తామని రూ. 5 వేల కోట్లు అప్పు చేసిందని, ఆ నిధులు ఎటు దారి మళ్లించాలో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.
రాజమండ్రిలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మీడియాతో మాట్లాడుతూ ప్రైవేటీకరణకు పీపీపీకి మధ్య వ్యత్యాసం తెలియని జగన్ ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఎలా పనిచేశారని విమర్శించారు.
పీపీపీ మోడ్ లోనే అనేక అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో మెడికల్ కాలేజీలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే వివరించారు. పీపీపీ మెడికల్ కాలేజీల్లో కన్వీనర్ కోటా మెరిట్ సీట్స్ 42 నుంచి 50 శాతానికి కూటమి ప్రభుత్వం పెంచిందని తెలిపారు. జగన్ ఉన్నప్పుడు 42 శాతం మెరిట్ సీట్లు 50 శాతానికి ఎందుకు పెంచలేదో వైసీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. జగన్ మాపై బురద చల్లేసి కడుక్కోమంటున్నారని అన్నారు. ఫ్యాక్షన్ తరహాలో మెడికల్ కాలేజీ కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో జగన్ ప్రజల మధ్య ఉండటం శ్రేయస్కరం కాదని, రాష్ట్ర శ్రేయస్సు కోసం జగన్ జైలుకు వెళ్లిపోవడమే మంచిదన్నారు. జగన్ లాగే ఆయన శిష్యులు ఫేక్ మాటలు మాట్లాడుతున్నారని, మాజీ ఎంపీ మార్గాని భరత్ రోజురోజుకీ దిగజారి పోతున్నారని విమర్శించారు.

# మెగా డీఎస్సీ ఫైనల్ సెలెక్షన్ లిస్ట్ విడుదల..

- అమరావతి: 2025 మెగా డీఎస్సీ ఫైనల్ సెలెక్షన్ లిస్ట్ విడుదల..
- రాష్ట్రవ్యాప్తంగా 16,347 టీచర్ పోస్టుల భర్తీ ప్రక్రియ..
- తుది జాబితా విడుదలతో ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియకు ముగింపు





**జర్నలిస్ట్ డైరీ, ఆంధ్రప్రదేశ్:**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి 2025 మెగా డీఎస్సీ ఫైనల్ సెలెక్షన్ లిస్ట్ విడుదలైంది. ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి సంతకం చేయగా, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ రోజు అధికారికంగా తుది జాబితాను రిలీజ్ చేశారు. అయితే, ఈ మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 16, 347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, సరైన అర్హత కలిగిన అభ్యర్థులు రాకపోవడంతో, చివరికి 15,941 పోస్టులను మాత్రమే భర్తీ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ తుది జాబితా ప్రకారం ఎంపికైన వారిలో 49 శాతం మహిళలు ఉన్నారు.
ఇక, మంత్రి లోకేష్ మాట్లాడుతూ, మెగా డీఎస్సీ ప్రక్రియ ఎంతో పారదర్శకంగా జరిగింది.. సీఎం చంద్రబాబు మార్గదర్శకత్వంలో ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేశామన్నారు. కేవలం 150 రోజుల్లోనే విద్యా శాఖ డీఎస్సీని పూర్తి చేసింది అన్నారు. అయితే, ఈసారి డీఎస్సీలో అవకాశం రాని వారు నిరాశ చెందవద్దు.. ఇక నుంచి ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కాగా, ఈ నియామక ప్రక్రియలో రాష్ట్ర వ్యాప్తంగా 3,36,300 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరయ్యారు. వీరి నుంచి మొత్తం 5,07,675 అప్లికేషన్లు వచ్చాయి. ఈసారి డీఎస్సీ పట్ల అభ్యర్థుల చాలా ఆసక్తిని చూపించారు.
అయితే, ఫైనల్ లిస్ట్‌లో ఎంపికైన వారికి ఈ నెల 19వ తేదీన నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు కూడా పాల్గొనే అవకాశం ఉంది. అనంతరం అభ్యర్థుల పోస్టింగ్‌ల కేటాయింపుకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. కాగా, ఫైనల్ లిస్ట్‌ను డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడవచ్చు. కొత్తగా హారిజాంటల్ రిజర్వేషన్లు అమల్లోకి తెచ్చినట్లు విద్యాశాఖ సెక్రటరీ కోన శశిధర్ చెప్పుకొచ్చారు. ఏవైనా సందేహాలు ఉంటే, సంబంధిత జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను అభ్యర్థులు సంప్రదించవచ్చని తెలిపారు.

# ఈ ఫుడ్స్ గుండె జబ్బులను తగ్గిస్తాయి

ప్రస్తుతం గుండె జబ్బులు రొటిన్ సమస్యలుగా మారాయి. వయసుతో సంబంధం లేకుండా అందరూ గుండె జబ్బు బారిన పడుతున్నారు. గుండె జబ్బులు, శ్వాస సంబధిత ఇబ్బందులు పడుతున్నారు. లైఫ్ స్టైల్, జీవన శైలి ఈ సమస్యలకు కారణం అని వైద్య నిపులు సూచిస్తున్నారు. ఆహారపు అలవాట్లలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీన్ని ఖచ్చితంగా నియంత్రించవచ్చు. అకస్మాత్తుగా రక్తపోటును పెంచే అటువంటి ఆహారాన్ని తీసుకోకుండా జాగ్రత్త వహించాలి. అధిక బిపి విషయంలో తక్షణ ఉపశమనం కలిగించే ఆహారాలను ఎల్లప్పుడూ తినాలి. అటువంటి ఆహారాలు తీసుకోవడం వల్ల రక్తపోటును నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆ ఆహారాలు ఏంటో కొన్ని విషయాలు తెలుసుకుందాం.



### మధుమేహాన్ని అదుపు చేసే ఆహారాలు:

ఆహారంలో పాలకూర, పాలకూర వంటి ఆకుపచ్చ కూరగాయల్లో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని తింటే రక్తపోటును నియంత్రించవచ్చు.

అరటిపండులో ఉంటే పొటాషియం రక్తపోటును నియంత్రిస్తుంది. అధిక బిపి సమస్య నుంచి దూరంగా ఉండటానికి రోజుకు ఒక అరటిపండు తినవచ్చు. దాని నుంచి కొన్ని రుచికరమైన వంటకాలు చేసి కూడా తినవచ్చు.

బీట్‌రూట్‌లో నైట్రిక్ ఆక్సైడ్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్త నాళాలు తెరవడానికి, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. రక్తపోటు అదుపులో ఉండాలంటే ఆహారంలో బీట్‌రూట్ చేర్చువాలని నిపుణులు చెబుతున్నారు.

వెల్లుల్లి యాంటీ బయోటిక్, యాంటీ ఫంగస్, నైట్రిక్ ఆక్సైడ్‌ను పెంచుతుంది. ఇది కండరాలను సడలించి రక్తనాళాలను విస్తరిస్తుంది. రక్తప్రసరణ మెరుగ్గా ఉండడం వల్ల బీపీ అదుపులో ఉంటుంది. పచ్చి వెల్లుల్లి రెబ్బలు తిన్నా.. వివిధ రకాల వంటలలో వేసుకుని తిన్న మంచి ఫలితం ఉంటుంది.

# వర్షా కాలంలో ఏ ఫుడ్ తినొద్దు.. ఏది తినాలి?





వర్షా కాలం వచ్చిందంటే చాలు అనేక వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఈ సీజన్లో వచ్చే జలుబు, దగ్గు, వైరల్ ఫీవర్, డెంగీ, గొంతు నొప్పి లాంటి సమస్యలు అధికంగా ఉంటాయి. అయితే ఆయుర్వేద నిప్పలు మాత్రం వీటిని తరిమికొట్టే ఉపాయాలు చెబుతున్నారు. వాటిల్లో ఒకటి బెల్లం, నల్లమిరియాలు. ఈ సీజన్లో వచ్చే వ్యాధులకు చెక్ పెట్టాలంటే దీనిని తినాలని చెబుతున్నారు. బెల్లం. మిరియాలతో ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో.. కొన్ని విషయాలు ఈ ఆర్టికల్లో తెలుసుకుందాం . దగ్గు, గొంతు నొప్పి, కీళ్ళ నొప్పులు, జీర్ణక్రియ, డిప్రెషన్ వంటి సమస్యలకు మంచి ఔషధం. పీరియడ్స్ నొప్పి తగ్గేందుకు, ఆకలి పెంచడానికి, తలనొప్పి, బరువు తగ్గడానికి మిరియాలను మిక్సీలో పట్టి పొడి చేసుకోవాలి. తర్వాత బెల్లం తురుమును కూడా పొడి చేసుకోవాలి. రోజు పరిగడుపున ఈ రెండు కలిపి ఒక టీ స్పూను తీసుకుంటే.. గొంతు నొప్పి, జలుబు, దగ్గు లాంటివి తగ్గిపోతాయి. పిల్లలకు పాలలో కలిపి ఇచ్చిన ఉపశమనం లభిస్తుంది. అయితే ఇలా నేరుగా తీసుకోలేని వాళ్ళు మిరియాలు పొడి, బెల్లం కలిపి ఆ నీటిని తాగిన జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కలుగుతుంది. అంతేకాకుండా.. ఒత్తిడి నుంచి కూడా ఉపశమనం కలుగుతుంది. మహిళలకు పీరియడ్స్ సమస్యలు ఉంటే దీనిని తీసుకోవడం వల్ల ఉపశమనం కలుగుతున్నది. ఆకలి కాదని చాలామంది చెబుతూ ఉంటారు. అలాంటి వాళ్ళు మిరియాలు, బెల్లం తింటే ఆకలి పెరుగుతుంది. కొందరికి డిప్రెషన్ కారణంగా తలనొప్పి కూడా పెరుగుతుంది. అలాంటివారు ఉదయం, సాయంత్రం మిరియాల పొడి, బెల్లం కలిపి తింటే తలనొప్పి నుంచి ఉపశమనం పొందవచ్చు. ఈ మధ్యకాలంలో చాలామంది అధిక బరువు పెరిగి చెడు కొలెస్ట్రాల్‌తో ఇబ్బంది పడుతున్నారు,



# అంజీర్ ఆకులతో ఎన్ని లాభాలో?

ఆయుర్వేదం ప్రకారం.. ఆకులు, చెట్ల వేళ్లల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. మనం ఆరోగ్యంగా ఉండాలంటే ఆకులు, చెట్ల వేళ్లతో చేసే కషాయాలు, మెడిసిన్ తీసుకోమంటారు. అయితే ఆంజీర్ పండ్లు ఖరీదైన డ్రై ఫ్రూట్స్ అని మనందరికి తెలుసు. కానీ మార్కెట్‌లో అంతకంటే ఎక్కువగా అంజీర్ ఆకులకు డిమాండ్ ఉందట. వీటి ధర రూ. 2 నుంచి 3 వేల వరకు ఉంటుంది. అంజీర్ ఆకుల్లో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. అంజీర్ పండ్ల కంటే ఆకులను ఎక్కువగా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిదట. ఈ ఆకులు జీర్ణశక్తిని బలోపేతం చేయడంతోపాటు గుండె జబ్బులు, మధుమేహాన్ని అరికడుతుంది. అంజీర్ ఆకులు తీసుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఈ ఆర్టికల్‌లో కొన్ని విషయాలు తెలుసుకుందాం.

### అంజీర్ ఆకుల వల్ల ప్రయోజనాలు:



అంజీర్ ఆకుల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఈ ఆకులు తీసుకుంటే కడుపులోని మలినాలు తొలగిస్తుంది. దీనివల్ల కడుపు సమస్యలు, మలబద్ధకం తగ్గిస్తుంది. అంజీర్ ఆకులు ప్రీబయోటిక్‌గా పనిచేస్తాయి. కడుపులో అనేక రకాల సమస్యలను తగ్గించే మంచి బ్యాక్టీరియాను ఉత్పత్తి చేస్తుంది. అంజీర్ ఆకులకు రక్తపోటును తగ్గించే శక్తి అధికంగా ఉంది. ఈ ఆకులు అధిక రక్తపోటును, చెడు కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది. అంజీర్ ఆకులకు రక్తంలో చక్కెర, మధుమేహాన్ని నియంత్రించే సామర్థ్యం ఉంది. ప్రతిరోజూ ఉదయం ఖాళీ కడుపుతో అంజీర్ ఆకులను నమిలి తింటే రక్తంలో చక్కెర శాతాన్ని బాగా తగ్గుతుంది.



### ఎప్పుడు తినాలి?

అంజీర్ ఆకులను ఉదయాన్నే తినాలి. అల్పాహారం తీసుకునే ముందు కొన్ని ఆకులను నమలడం వల్ల అనేక ప్రయోజనాలు లభిస్తాయి. దీన్ని ఉడికించి, టీ లాగా తయారు చేయవచ్చు. దీనికోసం నీటిని మరిగించి అందులో అంజీర్ ఆకులను వేసి టీ తయారు చేసి తాగాలి. పాశ్చాత్య దేశాల్లో అంజీర్ ఆకుల టీ చాలా ఫేమస్.





# ఎవరు విడాకులు తీసుకున్నా.. నాతో పెళ్లి అని రాసేశారు: మీనా

చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా అగ్ర కథానాయకుల సరసన నటించి స్టార్‌గా ఎదిగారు. తాజాగా ఆమె 'జయమ్ము నిశ్చయమ్మురా' కార్యక్రమానికి అతిథిగా హాజరై తన కెరీర్, పర్సనల్ లైఫ్ గురించి పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. స్టార్ హీరోలతో నటించిన జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కృష్ణ, రజనీకాంత్ ఇద్దరికీ తాను కూతురుగా, హీరోయిన్‌గా నటించినట్లు చెప్పారు. నటుడు జగపతి బాబు (Jagapathi Babu) హోస్ట్‌గా వ్యవహరిస్తున్న ఈ టాక్ షో 'జీ 5' (Zee 5)లో స్ట్రీమింగ్ అవుతోంది.

''చాలామంది నిర్మాతలు ఫ్లాప్‌లలో ఉన్నామని తక్కువ అమౌంట్‌తో సినిమా చేస్తున్నామని నన్ను సంప్రదించేవారు. నేను సరేనని అంగీకరించేదాన్ని. ఆ చిత్రాలు సూపర్‌హిట్ అయ్యేవి. తర్వాత నన్ను మర్చిపోయేవారు. ఎప్పుడూ ఇలానే జరిగేది. కెరీర్‌లో వరుస అవకాశాలు వస్తున్నప్పుడే పెళ్లి చేసుకున్నాను. ఆ తర్వాత పాప పుట్టిన రెండేళ్లకు మలయాళం సినిమా దృశ్యం కోసం నన్ను సంప్రదించారు. పాపను వదిలి వెళ్లలేక తిరస్కరించాను. వాళ్లు రిక్వెస్ట్ చేశారు. కథ రాసేటప్పుడు నన్ను దృష్టిలో పెట్టుకున్నట్లు తెలిపారు. వేరే వారితో సినిమా చేయలేమన్నారు. దీంతో అంగీకరించాను. మీరు (జగపతిబాబు) నాకు ఎప్పుడూ పోటీనే.. మీ పక్కన నేను వస్తుంటే నన్ను ఎవరూ చూసేవారు కాదు. అందరూ మిమ్మల్నే చూసేవారు'' అంటూ మీనా సరదా సంగతులు పంచుకున్నారు. దివంగత నటి సౌందర్యతో తన అనుబంధాన్ని పంచుకొని మీనా ఎమోషనల్ అయ్యారు. ఆరోజు ఎన్నికల ప్రచారానికి సౌందర్యతో పాటు తాను వెళ్లాల్సిఉందని కాకపోతే షూటింగ్ కారణంగా కుదరక వెళ్లలేదన్నారు.

ఇక తాను భర్తను కోల్పోయినప్పుడు సోషల్ మీడియాలో తనపై వచ్చిన న్యూస్‌పై మీనా అసహనం వ్యక్తంచేశారు. ''నా భర్త చనిపోయిన వారం తర్వాత నేను రెండో పెళ్లి చేసుకుంటున్నట్లు రాశారు. వాళ్లకు కుటుంబాలు ఉండవా.. ఇలా రాస్తున్నారు. అని చాలా బాధపడ్డాను. ఆ తర్వాత ఎవరు విడాకులు తీసుకొన్నా నాతో పెళ్లి అని రాసేవారు. అలాంటి వార్తల వల్ల నాకు అసహ్యం వేసేది'' అని తెలిపారు. 1986లో చైల్డ్ ఆర్టిస్టుగా ఇండస్ట్రీలోకి వచ్చిన మీనా తమిళంతో పాటు తెలుగులోనూ అగ్ర హీరోల సరసన నటించారు. రజనీకాంత్, చిరంజీవి, వెంకటేశ్, నాగార్జున, బాలకృష్ణ అందరితోనూ హిట్ సినిమాల్లో అలరించారు. కెరీర్‌లో మంచి అవకాశాలు వస్తున్నప్పుడే 2009లో విద్యాసాగర్‌ను వివాహం చేసుకున్నారు. ఆయన 2022లో అనారోగ్యం కారణంగా తుదిశ్వాస విడిచారు. ప్రస్తుతం మీనా 'మూకుతి అమ్మన్ 2'లో నటిస్తున్నారు.



# బాలీవుడ్ పరిస్థితులు అప్పుడే అర్థమయ్యాయి: ప్రియాంక చోప్రా

2000 సంవత్సరంలో మిస్ వరల్డ్ కిరీటాన్ని సొంతం చేసుకున్న అనంతరం నటి ప్రియాంక చోప్రా ఇండస్ట్రీకి వచ్చి స్టార్‌గా ఎదిగారు. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను సొంత నిర్మాణసంస్థను ప్రారంభించడానికి గల కారణాన్ని వెల్లడించారు. 2015లో తాను పర్పుల్ పెబుల్ పిక్చర్స్‌ను స్థాపించడానికి బాలీవుడ్ పరిస్థితులే కారణమన్నారు. ''2000 సంవత్సరం మిస్ వరల్డ్ కిరీటం గెలుచుకున్న తర్వాత ఇండస్ట్రీలో ఆఫర్లు వచ్చాయి. హిందీ, తమిళ సినిమాల్లో నటించడం మొదలుపెట్టా. ఆ తర్వాత రెండేళ్లకు బాలీవుడ్ పరిస్థితులు అర్థమయ్యాయి. సినీనేపథ్యం లేకుండా ఇండస్ట్రీకి వచ్చినవారిని ఎంత చులకనగా చూస్తారో తెలుసుకొన్నాను. తరతరాలుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నవారు స్టార్‌లుగా ఉన్నారు. అలాంటప్పుడు బయట నుంచి వచ్చినవారు పరిశ్రమలో కొనసాగడం అంత సులభం కాదు. కానీ, నేను ఎంతో కష్టపడి ఆఫర్లు అందుకొని సక్సెస్ అయ్యాను. ఏదైనా పట్టుదలతో ప్రయత్నించడం నా అలవాటు. నేను ఇబ్బందిపడినట్లు ఎవరూ పడకూడదనే ఉద్దేశంతో.. సినీ నేపథ్యం లేకుండా కొత్తగా ఇండస్ట్రీకి వచ్చేవారిని ప్రోత్సహించడానికే నిర్మాణసంస్థను స్థాపించాను'' అని ప్రియాంక తెలిపారు.

ప్రియాంక నిర్మాణసంస్థలో 2016లో సంతోశ్ మిశ్రా దర్శకత్వంలో వచ్చిన భోజ్‌పురి మొదటి సినిమాగా విడుదలైంది. ఆ తర్వాత ఆమె నటించిన పలు చిత్రాలు విడుదలై విజయాన్ని అందుకున్నాయి. ఇక ప్రియాంక సినిమాల విషయానికొస్తే.. ప్రస్తుతం SSMB 29లో నటిస్తున్నారు. రాజమౌళి దర్శకత్వంలో మహేశ్‌బాబు హీరోగా ఇది రూపొందుతోంది.



# వారం గ్యాప్ లో రెండు సినిమాలను దించుతున్న జాన్వీ

బాలీవుడ్‌లో జాన్వీ కపూర్ మెరుపులు చూపించలేకపోతుంది. ఫస్ట్ ఎంటప్‌టే‌లో భారీ స్కోర్ చిత్రాన్ని తన ఖాతాలో వేసుకుంది జాన్వీ కపూర్. ఇషాన్- జానూ జంటగా నటించిన దడక్ వంద కోట్లను వసూలు చేసింది. కానీ తర్వాత ఆ మార్క్ క్రియేట్ చేయడంలో తడబడుతోంది దడక్ రేంజ్ హిట్ మళ్ళీ రాలేదు. సగం సినిమాలు ఓటీటీకే పరిమితం కావడం కూడా ఆమెకు మైనస్‌గా మారాయి. బాలీవుడ్‌లో బ్లాక్ బస్టర్ సౌండ్ విని ఏడేళ్లు దాటి పోయింది. బ్లాక్ బస్టర్ సౌండ్ కోసం సెవెన్ ఇయర్స్ నుండి వెయిట్ చేస్తున్న జానూకు మరో ఝలక్ ఇచ్చింది పరమ్ సుందరి. కాంట్రవర్సీనో లేక సినిమా ఎక్కలేదో ఆడియన్స్ తిప్పికొట్టారు. అయిన సరే పట్టువదలకుండా ట్రై చేస్తోంది. బ్యాక్ టు బ్యాక్ చిత్రాలతో బాలీవుడ్ బాక్సాఫీసుపై దండయాత్ర చేస్తోంది జాన్వీ కపూర్. వారం గ్యాప్‌లో టూ ఫిల్మ్స్ దించేస్తోంది. ఈ ఏడాది కేన్స్ ఉత్సవాల్లో ప్రదర్శితమైన హౌంబౌండ్ సడెన్లీ రిలీజ్ డేట్ లాక్ చేసుకుంది. సెప్టెంబర్ 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇందులో దడక్ హీరో ఇషాన్ ఖత్తర్‌తో మరోసారి జోడీ కడుతోంది జానూ. వరుణ్ ధావన్, జానీ నటిస్తోన్న ఫిల్మ్ సన్నీ సంస్కారీ తులసి కుమారీ అక్టోబర్ 2న రాబోతుంది. ఈ ఇద్దరు బవాల్ అనే ఫిల్మ్ చేయగా అదీ ఓటీటీకే పరిమితమైంది. తెలుగులో భారీ హిట్ కొట్టి పెద్దికి ఛాన్స్ దక్కించుకున్న జానూకి. ఇప్పుడు బాలీవుడ్ ముంగిట్లో ప్రూవ్ చేసుకోవాల్సిన టైం. ఎందుకంటే ఈ రెండు తప్ప మరో బాలీవుడ్ ఆఫర్ లేదు. మరి జానూ ఖత్తర్‌తో కలిసి మ్యాజిక్ రిపీట్ చేస్తుందో లేదో.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465